PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 13.09.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 15 పేజీలు : 12, వెల : ₹ 4



ISO 9001-2008

Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry

CARE
SUPER SPECIALITY
DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555

Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి


www.lawyerteluguweekly.com

# రాజధాని చుట్టే రాజకీయం

ఒక పరిష్కారం దొరికితే ఎన్నో ప్రశ్నలకు సమాధానం దొరికినట్లవుతుంది. ఒక చిక్కుముడి వీడితే ఎన్నో సమస్యలు వైదొలుగుతాయి. ఎన్నో సమస్యలు, ఎన్నో ప్రశ్నలతో బిగుసుకుని వున్న ఆ చిక్కుముడే 'హైదరాబాద్'.

ఎప్పుడూ రాష్ట్ర రాజకీయాలు మాత్రమే హైదరాబాద్ చుట్టూ తిరుగుతుండేవి. కాని ఇప్పుడు దేశ రాజకీయాలు కూడా హైదరాబాద్ చుట్టూనే తిరుగుతున్నాయి. హైదరాబాద్ సమస్యకు కేంద్రప్రభుత్వం ఎలాంటి పరిష్కారం చూపిస్తుందా? అని దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.


వాస్తవాలను మాట్లాడుకుందాం... సమైక్యాంధ్రను కోరుకుంటున్న వారికి దాని మీద అంత ప్రేమవుండి కాదు.



- హైదరాబాద్‌ను పరిష్కరిస్తే మంటలు చల్లారినట్లే
- విభజనపై ఇక కాంగ్రెస్ మూర్ఖంగా ముందుకు పోనట్లే!

అలాగే ప్రత్యేకతెలంగాణ కోరుతున్న వారికి తెలంగాణ మీద అంత అభిమానముండి కాదు. ఇరువురి ప్రేమాభిమానాలు కూడా హైదరాబాద్ మీదే! హైదరాబాద్ లేని తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తున్నామంటే సీమాంధ్రలో ఏ ఒక్కరూ నోరెత్తేవాళ్లు కాదు. హైదరాబాద్ లేని తెలంగాణ అంటే తెలంగాణవాదులు అసలు ప్రత్యేకరాష్ట్రమే కోరుకోరు. హైదరాబాద్ లేకుండా ఒట్టి తెలంగాణను మాత్రం వాళ్లేం చేసుకుంటారు.

ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని హైదరాబాద్ పాడిఆవు లాంటిది. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో 50శాతం ఇక్కడి నుండే వస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడకముందు ఇక్కడ నిజాంనవాబులు కట్టించిన భవనాలు మాత్రమే వుండేవి. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఏర్పడ్డాకే హైదరాబాద్ (మిగతా 10వ పేజీలో)



జగన్ కోసం జనం ఎదురుచూపు

## బెయిల్ ఖాయం...
## కాంగ్రెస్ మాయం

***జగన్ కేసు క్లైమాక్స్‌కొచ్చిందా... ఈ నెలలో జగన్‌కు బెయిల్ రాబోతుందా? జైలు నుండి బయటకు రాబోతున్నాడా? రాష్ట్ర విభజన టాపిక్ లేకపోతే రాష్ట్రంలో ప్రస్తుతం ఇదే ప్రధాన హాట్‌టాపిక్‌గా వుండేది. విభజన గొడవల్లో పడి జగన్ బెయిల్ గొడవను మీడియా పెద్దగా పట్టించుకోవడం లేదు.***

జగన్ అక్రమాస్తుల కేసుకు సంబంధించి సెప్టెంబర్‌కల్లా తుది ఛార్జిషీట్ దాఖలు చేయాలని గతంలోనే సుప్రీంకోర్టు సీబీఐను ఆదేశించింది. ఈమేరకు ఈ నెలలోనే సిబిఐ మరో మూడుఛార్జిషీట్లు దాఖలుచేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు మేరకే జగన్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసారు. ఈ నెల 17, 18తేదీలలో కౌంటర్‌దాఖలు చేస్తామని సిబిఐ అభ్యర్థించింది. జగన్ అక్రమాస్తుల కేసుకు సంబంధించి పలువురు మంత్రులు, ఐఏఎస్ ఆఫీసర్లు, పారిశ్రామికవేత్తలను సైతం సిబిఐ నిందితులుగా చేర్చింది. వీరిలో కొందరు జైలులో వున్నారు. తనను జైలులో వుంచి 16నెలలయినా, తనపై నేరనిరూపణ కానందున జగన్ బెయిల్ మంజూరుకు పిటిషన్ వేసారు. ఈ నెలలోనే ఆయనకు బెయిల్ వచ్చే అవకాశాలు బలంగా వున్నాయని న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. జగన్ బయటకొస్తే... ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులలో రాజకీయాలలో అనూహ్యమైన మలుపులు తిరగొచ్చు.



రెండు జిల్లాలకే పరిమితం...

## గౌరవాన్ని మంటగలిపి...
## ఆత్మస్తుతి యాత్ర

**తెలంగాణ ఏర్పాటుకు నేను వ్యతిరేకం కాదు... ఆంధ్రా ఎంతో నాకు తెలంగాణ కూడా అంతే... అంటూ రెండుకళ్ల సిద్ధాంతాన్ని అనుసరించిన చంద్రబాబు తెలంగాణ ఏర్పాటుకు మద్దతుగా కేంద్రానికి లేఖ ఇచ్చారు. ఆ లేఖ ఇచ్చేటప్పుడు చంద్రబాబు ఉద్దేశ్యమేంటి..? ఎలాగూ కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చేది లేదు, సచ్చేది లేదు, నేను తెలంగాణ వ్యతిరేకి అన్న ముద్ర ఎందుకేయించుకోవాలన్న ఉద్దేశ్యంతోనే ఆయన లేఖ ఇవ్వడం జరిగింది.**

కాని ఆయన అనుకున్నదొకటయితే జరిగింది ఇంకొకటి. ఈ రాష్ట్రంలోని ప్రధానపార్టీలు ఇచ్చిన లేఖల ఆధారంగానే కాంగ్రెస్ వూహించని విధంగా విభజన నిర్ణయం తీసుకుంది. ఈ హఠాత్‌పరిణామానికి చంద్రబాబుకు దిమ్మతిరిగింది. తెలంగాణలో ఈయన లేఖ ఇచ్చేటప్పటికే సగం పార్టీ కేడర్ ఇతర పార్టీలలోకి వలసపోయింది. తెలుగుదేశం కొంత బలంగా వుండేది సీమాంధ్ర ప్రాంతంలోనే. విభజనకు అనుకూలంగా చంద్రబాబు లేఖ ఇవ్వడంతో ఇక్కడా పార్టీపై వ్యతిరేకత వచ్చింది. చంద్రబాబు లేఖ ఇవ్వడం వల్లే మేం విభజన నిర్ణయం తీసుకున్నామంటూ కాంగ్రెస్ నాయకులు చెప్పడం కూడా (మిగతా 10వ పేజీలో)



# సమన్యాయం నుండి సమైక్యానికి

> వై.యస్. బాటలోకొచ్చిన విజయమ్మ
> హోంమంత్రి షిండేకు ఘాటు లేఖ

రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్ రెండుపడవలపై కాళ్లతో ప్రయాణం చేస్తుంది. తెలంగాణ నేతలు విభజనకు అనుకూలంగా, సీమాంధ్రనేతలు విభజనకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. తెలుగుదేశంపార్టీది రెండుకళ్ల సిద్ధాంతమైంది. బీజేపీ, సీపీఐ విభజనకు అనుకూలంగా, ఎంఐఎం, సీపీఎం వ్యతిరేకంగా స్పష్టమైన నిర్ణయంతో వున్నాయి. విభజన విషయంలో వైయస్సార్‌కాంగ్రెస్ మాత్రం సమన్యాయం బాటలో నుండి పూర్తిగా సమైక్యాంధ్ర దారిలోకి వచ్చేసింది. వై.యస్. పక్కా సమైక్యవాదిగా నడుచుకున్నారు. కాని వైకాపా నాయకత్వం ఎందుకో ఓ దశలో విభజన విషయంలో కేంద్ర ప్రభుత్వందే తుది నిర్ణయమని స్పష్టం చేసింది. రాష్ట్ర విభజనను గట్టిగా వ్యతిరేకించలేదు. అంటే ఓ దశలో వైకాపా కూడా జోడుగుర్రాల సవారీ చేసింది.

అయితే కాంగ్రెస్ అధిష్టానం విభజన నిర్ణయం తీసుకున్నాక వైకాపా వైఖరి మారిపోయింది. కాంగ్రెస్ అడ్డగోలు విభజన నిర్ణయానికి వ్యతిరేకంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా రాజీనామాలు చేసారు. సమన్యాయం లేని విభజనకు తాము వ్యతిరేకమని వై.యస్.విజయమ్మ స్పష్టంగా ప్రకటించింది. విభజనను నిరసిస్తూ జగన్ జైలులోనే నిరాహారదీక్ష చేస్తే, ఆయన చెల్లెలు షర్మిల సమైక్యశంఖారావయాత్రను మొదలుపెట్టింది. ఇక విజయమ్మ ఢిల్లీలో ప్రధానిని కలిసి ఇరు ప్రాంతాలకు సమన్యాయం చేయలేనప్పుడు రాష్ట్రాన్ని సమైక్యంగానే వుంచండంటూ విన్నవించింది. ఏకాభిప్రాయంతోనే రాష్ట్ర విభజనపై నిర్ణయం తీసుకున్నామని చెబుతున్న కేంద్ర హోంమంత్రి షిండేకు ఆమె ఘాటుగానే లేఖ వ్రాసింది. ఇరుప్రాంతాలకు సమన్యాయం చేయండంటే ఒక ప్రాంతానికి అన్యాయం చేయమని కాదని, విభజన విషయంలో ఏకాభిప్రాయాలు కూడా లేవని ఆమె కుండబద్దలు కొట్టినట్లు ఆ లేఖలో పేర్కొంది. సమన్యాయం నుండి ఆమె కూడా రాష్ట్రాన్ని సమైక్యంగానే వుంచండంటూ కోరుతుంది. చంద్రబాబు రెండుకళ్లు, రెండుకాళ్లు, 36పళ్ల సిద్ధాంతాన్ని వదిలి సమైక్యాంధ్ర దారిలోకి వస్తే రాష్ట్రంలో మెజార్టీ పార్టీలు సమైక్య రాష్ట్రంవైపే మొగ్గుచూపినట్లవుతుంది.

PDF Compressor Free Version





## కలిసి రాని నేతలు...
# కలవని చేతులు

తెలంగాణ ఉద్యమం విషయంలో అక్కడి నాయకులందరూ పార్టీ జెండాలను పక్కనపెట్టారు. తెలంగాణ అంశాన్నే ఎజెండాగా పెట్టుకున్నారు. అక్కడి నాయకులంతా ఒకే తాటిమీద నడిచారు. పార్టీ ఏదైనా తెలంగాణ కోసం పోరాడుతున్న వారికి మద్దతుగా నిలిచారు. పార్టీలకు అతీతంగా అందరూ కలిసి జేఏసీగా ఏర్పడ్డారు.

వారిలో వున్న ఐక్యత సీమాంధ్ర నాయకుల్లో లేదు. వారిలో వున్న కసి ఇక్కడి నేతల్లో కనిపించడంలేదు. ఈ రాష్ట్రం ఏమైపోతే నాకేం, ఎలా తగలబడితే నాకేం నా పదవి పదిలంగా వుంటే చాలు అన్న ధోరణే ఇక్కడి నాయకులలో ప్రబలంగా కనిపిస్తుంది. సమైక్యాంధ్ర పోరాటం విషయంలో ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సీమాంధ్ర నేతల మధ్యే కాదు, మన జిల్లాలోని నేతల మధ్య కూడా అలాంటి లోపం వుంది. జిల్లాలో సమైక్యాంధ్ర పోరాటాన్ని ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, కార్మికులు, సామాన్య పౌరులు చేస్తున్నారు. రాజకీయనాయకుల ప్రభావం పెద్దగా లేకుండాపోయింది. జిల్లాకు చెందిన రాజకీయనాయకులందరినీ ఒకే వేదికమీదకు తెచ్చే ప్రయత్నాలు సఫలం కావడం లేదు. నాయకులు సమైక్యపోరాటం కంటే కూడా రాజకీయంగా తమ మధ్యవున్న విభేదాలకు అధికప్రాధాన్యతనిస్తూ ఒకరితో ఒకరు కలవడానికి మొగ్గుచూపడం లేదు.

ఈమధ్య నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి నాన్‌పొలిటికల్ జేఏసీని ఏర్పాటు చేద్దామని చెప్పి నెల్లూరు వీఆర్ కళాశాలలో ఒక సమావేశం ఏర్పాటు చేసారు. వివిధ ఉద్యోగ, విద్యార్థి, కుల, వృత్తి, వ్యాపార, ప్రజాసంఘాల వారు ఆ సదస్సుకు హాజరయ్యారు. అన్ని పార్టీల నాయకులను కూడా సదస్సుకు ఆహ్వానించినా కాంగ్రెస్‌పార్టీ వాళ్లు తప్పితే మిగిలిన పార్టీల నాయకులు ఈ సదస్సుకు హాజరు కాలేదు. కొందరు ఆనంతో వున్న రాజకీయ విభేదాల వల్ల దూరంగా వుంటే, మరికొందరు నేతలు మాత్రం తమను పిలవలేదని చెప్పి హాజరు కానట్లు తెలుస్తుంది. నేతలు సమైక్యాంధ్ర ఎజెండాకంటే తమ పార్టీ జెండాలకే ప్రాధాన్యతనిస్తుండడంతో రాజకీయ ఐక్యపోరాట వేదిక నిర్మాణం అసాధ్యమవుతుంది.



## సర్కార్ విద్యకు..

# సమైక్యసెగ

**దరిద్రుడి పెళ్ళికి వడగళ్ళ వానలాగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పాలిట సమైక్యాంధ్ర ఉద్యమం వచ్చినట్టయ్యింది. మౌలిక వసతుల లేమి, భర్తీకాని ఉపాధ్యాయ పోస్టులతో వారి చదువు అంతంత మాత్రంగా సాగుతుంటే ఇప్పుడు ఈ ఉద్యమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొనాల్సిరావడంతో బడులు మూతబడడం జరిగింది.**

విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు మొత్తం సమైక్యాంధ్ర, ఉద్యమంలోకిపోవడం తప్పనిసరై వారికీ పరిస్థితి ఏర్పడింది. కాని ఈ నేపథ్యంలో ఇది నాణానికి ఒకవైపు మాత్రమేననిపిస్తోంది. మరోవైపు చూస్తే ప్రభుత్వ పాఠశాలలు మాత్రమే ఇప్పుడు మూతబడడం, ప్రైవేటు పాఠశాలలు నిర్వహిస్తుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మరి నెల్లూరులో జరుగుతున్న ఈ ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రామలింగానికి ఆ విషయం తెలియదా? ప్రభుత్వ పరిపాలక శాఖలలోని అందరు అధికారులతో జరుగుతున్న ఉద్యమ సమావేశంలో చురుగ్గా పాల్గొంటూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరినీ ఉద్యమంలోకి ఆహ్వానిస్తున్న ఆయన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను ప్రభావితం చేయలేకపోయారా లేక లోపాయకారితనంగా వ్యవహరిస్తున్నారా అన్నది అందరికీ మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోతోంది. ప్రభుత్వ, పంచాయతీరాజ్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను చైతన్య పరచిన ఆయనకు ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కనిపించ లేదా లేక మరే కారణమేమన్నా వుందా అని అందరూ చెవులు కొరుక్కుంటున్నారు. ఆయన పిల్లలు చదివేది ప్రైవేటు పాఠశాలలోనే కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నారేమోనని కూడా కొందరు సందేహిస్తున్నారు. ఏదేమైనా బంద్‌లతో ఇప్పటికే విద్యార్థులు ఈ సమైక్యాంధ్ర ఉద్యమంతో వెలకట్టలేని నష్టానికి గురవుతున్నారు. ధనికుల, మేథావుల పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతుండడం వల్ల వాటి జోలికి ఎవరూ పోకపోవడం, పేదల పిల్లలు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలను మాత్రం బలిపెట్టడం జరుగుతోందనిపిస్తోంది.

ఇప్పటికన్నా కళ్ళు తెరచి ఎటువంటి ఉద్యమాలైనా రాష్ట్ర, దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు జోలికి వెళ్ళకుండా చూస్తే మంచిది.



# చింతాపై చిటపట

ఈమధ్యకాలంలో జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో తిరుపతి ఎంపీ చింతా మోహన్ పట్ల సానుకూల వైఖరి వచ్చింది. పేరుకు తిరుపతి నియోజకవర్గమైనా దాని పరిధిలో వున్న నాలుగు అసెంబ్లీలు నెల్లూరు జిల్లాలోనివే! మెజార్టీ ఓట్లు ఈ జిల్లా క్రిందకే వస్తాయి. ఆ మధ్య ఎక్కువగా చింతా మోహన్ జిల్లాలో అభివృద్ధిపనులపై ఆసక్తి చూపించారు. పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి తన డాబు దర్పం చూపించారు. కొందరు అధికారులను నోరారా తిట్టారు. అయితే ఇవన్నీ పక్కనపెడితే జిల్లా ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోయినా దుగరాజపట్నం ఓడరేవు మంజూరుకు గట్టిగా పోరాడింది చింతా మోహనే! నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి జిల్లాప్రజలకు కనీసం ముఖం కూడా చూపించని పరిస్థితుల్లో జిల్లా పరిధిలోని మరోఎంపీగా చింతా మోహన్ అప్పుడప్పుడు పలు పనులపై చర్చించేవాడు. అయితే సమైక్యాంధ్ర ఉద్యమం విషయంలో ఆయన వైఖరి వివాదాస్పదమైంది. తిరుపతి కేంద్రంగా పెద్దఎత్తున సమైక్యాంధ్ర ఉద్యమం జరుగుతుంది. నెల్లూరుజిల్లాలోనూ ఉద్యమాలు జరుగుతున్నాయి. ఆయనకు ఓట్లేసి గెలిపించిన ప్రజలే ఈ ఉద్యమాలలో పాల్గొంటున్నారు. అయినా ఆయనకు చీమ కుట్టినట్లు కూడా లేదు. ప్రజలకు కనపడకుండా తప్పించుకు తిరుగుతున్నారు. కనీసం సమైక్యాంధ్ర ఉద్యమానికి మద్దతు కూడా పలకడంలేదు. అందుకే తిరుపతి, నెల్లూరు జనాలు చింతా మోహన్ కనపడడం లేదంటూ వాల్‌పోస్టర్లు అంటిస్తున్నారు.



# మౌనమేలనయ్యా... ఓ మంత్రివర్యా!

రాష్ట్ర విభజన ప్రకటన చేసాక సీమాంధ్ర జిల్లాల్లోని ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొంటున్నారు. వరుసగా బంద్‌లతో విద్యార్థుల చదువులు పోతున్నాయి. ఉపాధ్యాయుల జీతాలు పోతున్నాయి. ఈ విధంగా వాళ్లు నష్టపోతున్నారు. బస్సులు ఆగిపోయాయి. కార్మికులు సమ్మెలో వున్నారు. ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాపారాలు తగ్గిపోయి ఆ వర్గంవారు సతమతమవుతున్నారు. ఉద్యోగులు ఆఫీసులకు తాళాలేసి సమ్మెలో పాల్గొంటున్నారు. వారు వీరు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ సమైక్యాంధ్ర ఉద్యమానికి తలా ఒక సమిధను అందిస్తున్నారు. రాజకీయ నాయకులలో అయితే కొందరు ప్రత్యక్షంగా, మరికొందరు పరోక్షంగా ఉద్యమానికి సహకరిస్తున్నారు.

కాని జిల్లాకు చెందిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మటుకు సమైక్యాంధ్ర ఉద్యమం ముఖమే చూడ్డంలేదు. మీరెటైనా చావండి, నా దారి నాదే అన్నట్లుగా వుందాయన వ్యవహారశైలి. రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచాలంటూ అందరు మంత్రులతో కలిసినప్పుడు ప్రకటనలు చేస్తున్నాడు తప్పితే చిత్తశుద్ధిగా సమైక్యాంధ్ర కోసం పోరాడడం లేదు. ఇది ఆనం అనుచరులకు అసంతృప్తి కలిగిస్తుంది.

ఎందుకంటే కరుడుగట్టిన సమైక్యవాదులని ఆనం కుటుంబానికి గట్టి పేరుంది. 1972లో జైఆంధ్రా ఉద్యమ సమయంలో కూడా రాష్ట్ర సమైక్యతను కోరుకున్న రాజకీయ కుటుంబం వారిది. ఇప్పుడు కూడా ఆ కుటుంబంలో ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి సమైక్యాంధ్ర ఉద్యమం నడుపుతున్నారు. వారి సోదరులు ఆనం జయకుమార్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డిలు ఎవరి దారిలో వాళ్లు ఆందోళనలలో పాలుపంచుకుంటున్నారు. కాని ఆనం రామనారాయణరెడ్డి మాత్రం సమైక్య ఆందోళనలలో ఎక్కడా పాల్గొనడం లేదు. కేంద్రం చేసిన రాష్ట్ర విభజన ప్రకటనపై కూడా అయన వ్యాఖ్యానించడం లేదు. మంత్రి మౌనం వెనుక రాజకీయ రహస్యం ఏమై వుంటుందన్నది ఎవరికీ అంతుబట్టడం లేదు.



## వై.యస్. వుంటే..
# రాష్ట్రం ఇలా వుండేదా?

- సమైక్యశంఖారావం సభలో షర్మిల
- రాజన్న బిడ్డకు జన నీరాజనం

రాష్ట్ర విభజనను నిరసిస్తూ దివంగత మహానేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి ముద్దుల తనయ షర్మిల చేపట్టిన సమైక్య శంఖారావం బస్సుయాత్రకు జిల్లాలో అపూర్వస్పందన లభించింది. వేలసంఖ్యలో వై.యస్. అభిమానులు, వైకాపా కార్యకర్తలు షర్మిలకు స్వాగతం పలికారు. 8వ తేదీ ఉదయం కడపజిల్లా బద్వేల్ నుండి బయలుదేరిన ఆమె ఆత్మకూరుకు చేరుకున్నారు. ఇక్కడ బహిరంగసభలో ప్రసంగించిన అనంతరం సంగం మీదుగా బుచ్చికి చేరుకుని అక్కడ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం రాజుపాలెం మీదుగా కావలికి చేరుకుని అక్కడ బహిరంగసభలో ప్రసంగించారు. ఆ రాత్రికి ఆమె కావలిలోనే బసచేసారు. మీ రాజన్నే బ్రతికుంటే రాష్ట్రానికి ఈ పరిస్థితి దాపురించేదా? అని ప్రజలను ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా, అన్ని ప్రాంతాల వారు అన్నదమ్ముల్లా కలిసి వుండాలని వై.యస్. కోరుకున్నారు. అందుకోసమే భారతదేశ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేని ఎన్నో అద్భుత పథకాలను తీసుకొచ్చారు. ఆయన ముఖ్యమంత్రిగా వున్నంతకాలం రూపాయి పన్ను పెంచలేదు. ఎలాంటి ఛార్జీలు పెంచలేదు. కాని నేటి పాలకులు వై.యస్. ఆశయాలకు తూట్లుపొడిచి ప్రజల బ్రతుకులతో ఆడుకుంటున్నారని ఆమె విమర్శించారు. సీమాంధ్ర ప్రజల మనోభావాలను పట్టించుకోకుండా నిరంకుశంగా రాష్ట్రాన్ని విడదీయాలనుకుంటున్నారు. కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్ర విభజనను అడ్డుకోవాల్సిన ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు తెలంగాణకు లేఖ ఇచ్చి తెలుగుప్రజలకు ద్రోహం చేసాడని షర్మిల విమర్శించారు. రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచాలనే తపనతో జగనన్న జైలులోనే నిరాహారదీక్షకు పూనుకున్నారని చెప్పారు.

ఈ యాత్రలో ఆమె వెంట ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, జిల్లా పార్టీ కన్వీనర్ మేరిగ మురళీధర్, పార్టీ సిఇసి సభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, పాశం సునీల్‌కుమార్, నేదురుమల్లి పద్మనాభరెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# గూడూరు సావిత్రి నాటక కళాపరిషత్



నెల్లూరుజిల్లా నాటక రంగం అంటే గుర్తొచ్చేపేరు గూడూరు సావిత్రి. ఏ పాత్రలోనైనా ఇట్టే ఒదిగిపోయే నటనాకౌశల్యం ఆమె సొంతం. ఎక్కడ నాటకప్రదర్శనలు జరుగుతున్నా అందులో గూడూరు సావిత్రి వుందంటే ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా వచ్చేవాళ్లు. నాటకరంగ ప్రేక్షకులను అంతగా మెప్పించిన గూడూరు సావిత్రి పేరు మీద 'గూడురు సావిత్రి నాటకళాపరిషత్' ఏర్పాటయ్యింది. దీనిని ఈ నెల 14వ తేదీన సాయంత్రం 6.30గంటలకు నెల్లూరులోని పురమందిరం నందు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రచయిత్రి ఆర్.పవనకుమారి రచించిన "గూడూరు సావిత్రి నటజీవితం-ఒక పరిశీలన" పుస్తకావిష్కరణ జరుగుతుంది. ఈ సభా కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, కళారంగ ప్రముఖులు, నగర ప్రముఖులు గౌరవ అతిథులుగా పాల్గొంటారు.

ఈ సందర్భంగా సభానంతరం భక్త చింతామణి(భవాని, కృష్ణాష్టమి సీన్లు), బాలనాగమ్మ(మాయలఫకీర్ - సంగు సీను), గయోపాఖ్యానం(శ్రీకృష్ణార్జునుల యుద్ధ సీను), శ్రీరామాంజనేయయుద్ధం (యుద్ధసీను), సత్యహరిశ్చంద్ర(వారణాసి సీను) నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసారు. సినిమాల మోజులో ఇలాంటి ఆణిముత్యాల్లాంటి నాటకాలను నేటితరాలవారు చూసే అవకాశమే లేకుండాపోయింది. ఈ ఆధునిక కాలంలో కూడా నాటకాలకున్న ఆదరణను తెలియజెప్పడానికి గూడూరు సావిత్రి నాటక కళాపరిషత్ వ్యవస్థాపకులు చేస్తున్న కృషి అభినందనీయం.

## వాడవాడలా వేడుకగా...

# వినాయకచవితి సంబరాలు



నెల్లూరు నగరంలో సోమవారం వినాయకచవితి పండుగను భక్తిశ్రద్ధలతో వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నగరంలో వాడవాడలా ప్రతి ప్రధాన సెంటర్లో గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఓ వైపు సమైక్యాంధ్ర ఉద్యమం తీవ్రస్థాయిలో జరుగుతున్నా ఎన్జీవోలు, పేద మధ్య తరగతి ప్రజలు జీతాలులేక పనులులేక అవస్థలు పడుతున్నా హిందువులకు ప్రథమంగా వచ్చే వినాయకచవితి పండుగను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాత్మకంగా జరుపుకున్నారు.

వాడవాడలా మిత్రమండలి, యూత్ అసోసియేషన్ సభ్యులు పోటాపోటీగా భారీ గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించి, వివిధ రకాల పుష్పాలంకరణలతో, విద్యుద్దీపతోరణాల కాంతులతో కనువిందుగా ఏర్పాటుచేసారు. ప్రతి ఇంటిలో తొలిపండుగ వినాయకచవితిని శక్తి మేర జరుపుకున్నారు. నెల్లూరు నగరం కాపువీధిలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహానికి రాష్ట్రమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఆనం విజయకుమార్‌రెడ్డి, వారి కుటుంబసభ్యులు అందరూ కలిసి విశేషపూజలు నిర్వహించారు. ఏసీ సెంటర్‌లోని గణేష్ విగ్రహానికి ఆనం జయకుమార్‌రెడ్డి తదితరులు పూజలు నిర్వహించారు. చిన్నబజార్, పెద్దబజార్, కాపువీధి, కామాటివీధి, సంతపేట, రంగనాయకులపేట, ఆర్ఆర్ వీధి, స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధి, వెంగళరావునగర్, నిప్పో వెనుక, పొదలకూరురోడ్డు, సంజయ్‌గాంధీ నగర్, ఎన్‌సిసి కాలనీ, ఆచారివీధి, నారాయణరావుపేట, నవాబుపేట, యడ్లవారివీధి, పొగతోట, పద్మావతి సెంటర్ తదితర ప్రాంతాల్లో భారీ గణేష్ విగ్రహాలకు ఏర్పాటుచేసి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. పలుచోట్ల నేత్రపర్వంగా ఉట్టి మహోత్సవాలను నిర్వహించారు.



# జర్నలిస్టులకు సన్మానం

లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ప్రగతి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నెల్లూరు నగరం సంతపేటలోని ఓబయ్య బిడి(లయన్ దరిశి రంగయ్య బ్లాక్)లో అంతర్జాతీయ లయన్స్ సమాఖ్య క్యాలెండర్ ఈవెంట్స్ ప్రకారం టీచర్స్ డే సందర్భంగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు జి.లక్ష్మమ్మ (శ్రీరాధాకృష్ణ ప్రాథమిక పాఠశాల) టి.రేఖకేరన్ (రిటైర్డ్ టీచర్, ఎబియం గరల్స్ హై స్కూల్)లకు, జర్నలిస్టు డే సందర్భంగా జర్నలిస్టులు మనుబోలు ప్రభాకర్‌రావు, ఏ.జయప్రకాష్, వి.శ్రీరామచంద్రమూర్తి, వి.భాస్కర్, పి.సుబ్బారావు, వల్లూరు మాధవరావులను శాలువతో, పూలమాలలతో లయన్స్ క్లబ్ సభ్యులు సన్మానించారు. ఈకార్యక్రమంలో డా॥పి.మధుసుదనశాస్త్రి, చంద్రన్, ఆసిఫ్‌పాషా, లయన్స్ జోన్ ఛైర్మన్ బి.వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ప్రగతి అధ్యక్షులు యస్.డి.తాజుద్దీన్, కార్యదర్శి యస్.ఎ.రసూల్, కోశాధికారి కె.వి.సుబ్బారావు, డి.శ్రీధరరావు, డివిఎస్.కుమార్, సుధాకరరావు, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సభానంతరం మనుబోలు ప్రభాకరరావు చేసిన మిమిక్రీ అందరిని ఆకట్టుకుంది.

అలాగే వాసవి క్లబ్, వనిత క్లబ్ అధ్యక్షులు సి.శరత్‌కుమార్, సి.ఉమారాణిల ఆధ్వర్యంలో హోటల్ అతిథిగ్రాండ్‌లో పాత్రికేయులు కె.దయాశంకర్, సుందరం, కృష్ణయ్య, మురళీలను సత్కరించారు.



# ఆకట్టుకున్న ఆంధ్ర మహాభారత ఉపన్యాసములు





సభలలో ఏజేసీ పెంచలరెడ్డిని, డిఆర్‌ఓ బి.రామిరెడ్డిని సత్కరిస్తున్న అతిథులు జె.యస్.రెడ్డి, వి.హాజరత్‌బాబు, బి.వి.నరసింహం, ఎం.ఆర్.ప్రసాద్, ఎన్.బలరామయ్యనాయుడు

నెల్లూరు పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో నగరంలోని టౌన్‌హాలులో ఈనెల 5,6,7 తేదీలలో నిర్వహించిన ఆంధ్ర మహాభారత ఉపన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. టిటిడి హరివంశ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు కర్ణ పర్వము ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్వాసముల పై ప్రసంగించారు. మహాభారతం నవరసాల మిళితమని పేర్కొన్నారు. 5వ తేది జరిగిన కార్యక్రమంలో సభాధ్యక్షులుగా నెల్లూరుజిల్లా అడిషనల్ జాయింట్‌కలెక్టర్ సిహెచ్ పెంచలరెడ్డి వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా మురళీకృష్ణ హోటల్స్ ఎండి వీరిశెట్టి హాజరత్‌బాబు హాజరయ్యారు. 6వతేది జరిగిన కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు జెయస్‌రెడ్డి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా బిరదవోలు రామిరెడ్డి విచ్చేసారు. 7వతేది జరిగిన కార్యక్రమంలో నెల్లూరు డిఆర్‌ఓ బి.రామిరెడ్డి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా నిర్మలా ఏజెన్సీస్ అధినేత యస్.నరసింహారెడ్డి విచ్చేసారు. ఈ మూడు రోజులు సభాకార్యక్రమాలకు ముందు సుప్రసిద్ధ రంగస్థల కళాకారులు ఆలపించిన పౌరాణిక పద్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, కార్యదర్శి యం.వేణుగోపాలయ్య, కోశాధికారి సహస్రసభాసింహం బివి నరసింహం, సంయుక్త కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు సభ్యులు కె.సుందరరామయ్య, ఎన్.బలరామయ్యానాయుడు పర్యవేక్షించారు.

## గాంధీ ఆశ్రమంలో కలెక్టర్

నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలంలో పల్లెపాడులో ఉన్న గాంధీ ఆశ్రమాన్ని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ 7వ తేదీన సందర్శించారు. ఆశ్రమ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి ఖద్దర్ మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన గాంధీజీ ఫోటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఆశ్రమ వివరాలను, ప్రస్తుతం చేపడుతున్న, భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలను గురించి కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ కన్వీనర్ గణేశం కృష్ణారెడ్డి సభ్యులు సుబ్బారెడ్డి, రవీంద్రరెడ్డి, డాక్టర్ ఏవీసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# సమైక్య పరిరక్షణ వేదిక కార్యచరణ ప్రణాళిక



తెలంగాణ రాష్ట్ర ప్రకటన నిరసిస్తూ ఉద్యోగ, విద్యార్థి, కార్మిక సంఘాల ఐక్య పరిరక్షణ వేదిక నాయకత్వంలో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేసామని సమైక్య రాష్ట్ర పరిరక్షణ వేదిక ఛైర్మన్ డి.ఆర్.ఓ బి.రామిరెడ్డి తెలిపారు. గత నెలన్నర రోజులుగా అలుపెరగకుండా పోరాడుతున్న వేదిక నెల్లూరు, కావలిలలో ఇప్పటికే లక్షగళార్చన చేసిందని, అదే విధంగా ఈ నెల 13న జిల్లాలోని అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు ముట్టడి చేయాలని, 14వ తేదీ జిల్లాలోని అన్ని ముఖ్యకేంద్రాల్లో మహిళలతో మహార్యాలీ, 15న నాయుడుపేటలో లక్షగళఘోష, 16న నెల్లూరులో జిల్లా స్టీరింగ్‌కమిటీ సమావేశం, 17వ తేదీ పొదలకూరులో లక్షగళ నినాదం, 19న గూడూరులో లక్షగళ పాలికేక, 21న ఆత్మకూరు, 25న వెంకటగిరి, 27న బుచ్చిరెడ్డిపాళెం, 29న వింజమూరు, అక్టోబర్ 1న సూళ్లూరుపేటలలో వరుసగా లక్షగళఘోష కార్యక్రమాలతో ఢిల్లీలోని పెద్దలకు వినిపించేలా తమ సమైక్యవాదాన్ని వినిపిస్తామని, ఈ కార్యక్రమాలలో విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, ఉద్యోగులు పాల్గొనాలని ఆయన కోరారు.

# కోడూరు అంత్యక్రియలలో వై.వి.సుబ్బారెడ్డి

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు కోడూరు సుధాకర్‌రెడ్డి(57) మంగళవారం చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. షర్మిల బస్సుయాత్రలో ఆదివారం బుచ్చిరెడ్డిపాళెం వద్ద ప్రమాదవశాత్తు బస్సుపైనుంచి కిందపడిన సుధాకర్‌రెడ్డిని నెల్లూరు నారాయణ ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్రంగా గాయాలు కావడంతో వైద్యులు చికిత్స చేసారు. చికిత్స అనంతరం ఫలితం లేకపోవడంతో సోమవారం చెన్నై అపోలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుధాకర్‌రెడ్డి మృతి చెందారు. కోడూరు సుధాకర్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం బుచ్చిలో జరిగిన అంత్యక్రియలలో వైకాపా నాయకులు వై.వి.సుబ్బారెడ్డితో పాటు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితర వైకాపా నాయకులు పాల్గొన్నారు.



సుధాకర్‌రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న వై.వి.సుబ్బారెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
- సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
- ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.

PDF Compressor Free Version






## వితండవాదం

హైదరాబాద్‌లో ఏపిఎన్‌జిఓల సభను అడ్డుకోవాలని తెలంగాణ నాయకులు చేసిన ప్రయత్నాలు వమ్మయ్యాయి. ఏపిఎన్‌జిఓలు సభ పెట్టుకున్నరోజే బంద్ పాటించి తెలంగాణ నేతలు తమ హీన సంస్కారాన్ని చాటుకున్నారు. ఇంకా రాష్ట్ర విభజన జరగలేదు. విభజన జరిగినా పదేళ్ల దాకా హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగానే వుంటుందని కేంద్రం చెబుతుంది. మరి ఇప్పుడే పరిస్థితులు ఇలా వుంటే రేపెలావుంటాయో ఆలోచించాలి.

సాగర్, కావలి.

## ఉద్యోగులు... శెభాష్

రాజకీయ నాయకులు సిగ్గు వదిలి ముఖం చాటేసినా రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచడం కోసం ఉద్యోగులు చేస్తున్న ఉద్యమానికి అభినందనలు. నెలరోజులకు పైగా జీతాలు లేకున్నా వాళ్ళు పోరాడుతున్నారు. సీమాంధ్రలోని కేంద్రమంత్రులు తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తుండడం శోచనీయం.

కె.వి.రంగారెడ్డి, నెల్లూరు.

## తెలుగు నీరసపడింది

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలంతో సంపూర్ణ తెలుగు రాష్ట్రంగా ఏర్పడింది ఆంధ్రప్రదేశ్. ఎన్టీఆర్ కాలంలో ఓ వెలుగు వెలిగింది. కిరణ్ పాలనలో ముగింపు దశకు వచ్చింది. సమైక్యాంధ్ర, తెలంగాణ నినాదాలతో తెలుగు నీరసపడింది. ఆంగ్లమాధ్యమ పాఠశాలలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో వున్న భాషాభిమానం మనకు లేకుండాపోయింది. తెలుగు మాట్లాడడం అవమానంగా భావించే తల్లిదండ్రులు తెలుగుకు సమాధి కడుతున్నారు.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## లాభముంటుందా?

సీమాంధ్ర ప్రజలు చేస్తున్న ర్యాలీలు, ధర్నాలు, సమ్మెల వల్ల ఏమన్నా లాభం ఉంటుందా? వీరు ఇక్కడ ధర్నాలు చేస్తుంటే ఢిల్లీ దేవతకు తెలుస్తుందా? వీటివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

జె.యస్.కృష్ణ, నెల్లూరు.

## 'ప్రభా'తం

నోటితో మాట్లాడుతూ నొసటితో వెక్కిరించినట్లుగా వుంటుంది కాంగ్రెస్ పెద్దల వ్యవహారం. రాష్ట్ర విభజన విషయంలో చేసిన పొరపాటును సరిదిద్దుకోకపోగా, దానిని కప్పిపుచ్చుకునేందుకు వరుసగా తప్పులు చేస్తున్నారు. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా 13జిల్లాల్లో 5కోట్ల మంది ప్రజలు రగిలిపోతూ ఉద్యమాలుచేస్తుంటే, దాని గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా తెలంగాణ నోట్ తయారవుతుందంటూ, తెలంగాణ ప్రక్రియ ఆగదంటూ కాంగ్రెస్ పెద్దలు చేస్తున్న ప్రకటనలు పుండుమీద యాసిడ్ చల్లిన విధంగా వుంటున్నాయి. కాంగ్రెస్‌పార్టీ నిరంకుశ విధానానికి, ప్రజాభిప్రాయాన్ని ఏ మాత్రం పరిగణలోకి తీసుకోవడంలేదన్న దానికి ప్రత్యక్షసాక్ష్యంగా ఇది వుంది.

రాష్ట్ర విభజనపై కాంగ్రెస్ ప్రకటన చేసాక ఈ రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయన్నది దేశమంతా చూస్తూనే వుంది. దేశంలోని ఒక పెద్ద రాష్ట్రాన్ని విభజించడానికి తగిన కసరత్తు చేయలేదు. తెలంగాణలో ఎటువంటి డిమాండ్ లేని సమయంలో కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ ప్రకటన చేసింది. అది కూడా హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ అంది. మరి 60ఏళ్ల పాటు రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రజల ఉమ్మడి సంపాదనతో అభివృద్ధి చేసుకున్న రాజధాని నగరాన్ని ఉన్నట్లుండి ఒక ప్రాంతం వారికే గుత్తసొత్తుగా ఇచ్చేస్తామంటే మిగిలిన రెండు ప్రాంతాల వారికి మండదా? మా నుండి హైదరాబాద్‌ను దూరం చేయడానికి వీల్లేదంటూ సీమాంధ్రలో ఒకటిన్నర నెల నుండి భారీ ఆందోళనలు జరుగుతూనే వున్నాయి. రాష్ట్రం నిప్పుల కుంపటిగా మారినా దీనిని చల్లార్చే ఒక్క మాట కూడా ఇంతవరకు కాంగ్రెస్ పెద్దల నుండి రాలేదు. అగ్గిరాజేసి సోనియా గాంధీ అమెరికాకు పోగా, ఆమె ముఖ్యఅనుచరులు అగ్గికి ఆజ్యంపోసే పనిలో పడ్డారు.



### భూస్థాపితానికి సిద్ధం

**తాత్కాలిక ప్రయోజనాలను ఆశించి కాంగ్రెస్‌పార్టీ తన పతనానికి తానే మరణ శాసనం వ్రాసుకుంటుంది. అధికారం కోసం ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య చిచ్చుపెడుతూ వారిని శాశ్వత శత్రువులుగా మార్చేస్తుంది. ప్రజలమనసుల్లో కాంగ్రెస్ అంటే విరక్తి కలిగేలా ఆ పార్టీ అధిష్ఠానం వ్యవహరిస్తుంది.**

ఈరోజు సమైక్యాంధ్ర ఉద్యమంలో కీలకపాత్రధారులు ఎన్‌జిఓలే! సీమాంధ్ర ప్రజల ఓట్లతో ఎంపీలుగా గెలిచి కేంద్రంలో మంత్రి పదవులు వెలగబెడుతున్న నాయకమహానుభావులు ఈరోజు సీమాంధ్ర ప్రజల ముఖాలు చూడ్డానికే ముఖం చాటేస్తున్నారు. కొంతమంది ఎంపీలు, రాష్ట్ర మంత్రులదీ అదే పరిస్థితి. ఇక రాష్ట్ర విభజన ప్రక్రియపై బలంగా యుద్ధం ప్రకటించింది ఏ.పి ఎన్‌జిఓలే! నెలరోజులకుపైగా సీమాంధ్రలోని 13జిల్లాల్లో ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. పరిపాలన, పనులు అన్నవే లేకుండా పోయాయి. హైదరాబాద్ మాది, దీనిని మా నుండి ఎవరూ వేరుచేయలేరంటూ ఏ.పి ఎన్‌జిఓలు ఈ నెల 7వ తేదీన హైదరాబాద్ ఎల్.బి స్టేడియంలో 'సేవ్ ఆంధ్రప్రదేశ్' పేరిట నిర్వహించిన సభకు భారీస్పందన వచ్చింది. ఉద్యోగులతో స్టేడియం కిటకిటలాడింది. పోలీసుల నిబంధనల వల్ల చాలామంది ప్రైవేట్ ఉద్యోగులు స్టేడియం బయటే నిలిచిపోయారు. అడుగడుగునా అవాంతరాలు ఎదురైనా ఈ సభను ఎన్‌జిఓలు దిగ్విజయంగా పూర్తిచేసారు. ఎన్నో అవాంతరాల మధ్య సభకు అనుమతి తెచ్చుకున్నారు. పోలీసులు సభకు పరిమితులు విధించారు. సభరోజే తెలంగాణ జేఏసీ బంద్‌కు పిలుపునిచ్చింది. హైదరాబాద్‌లో బస్సులు నడవలేదు. బయట జిల్లాల నుండి హైదరాబాద్‌కు బస్సులు లేవు. అయినా 13సీమాంధ్ర జిల్లాల నుండి ఎన్‌జిఓలు బస్సులు, రైళ్లు, ప్రైవేట్ వాహనాలలో హైదరాబాద్‌కు చేరుకున్నారు. హైకోర్టు మార్గదర్శకాలను తు.చ తప్పకుండా ఎవరినీ రెచ్చగొట్టకుండా, ఎటువంటి విద్వేషపు ప్రకటనలు చేయకుండా సభను ఎంతో హుందాగా నిర్వహించి చట్టాలు, న్యాయస్థానం పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు. ఓవైపు హైదరాబాద్‌లో భారీసభ జరుగుతుంటే అదే సమయంలో ఢిల్లీలో కేంద్రహోంమంత్రి సుశీల్‌కుమార్‌షిండే విలేకరుల సమావేశంపెట్టి తెలంగాణనోట్ తయారవుతుందని చెప్పడం రాష్ట్రంలో నెలకొన్న విద్వేషాలను మరింత రెచ్చగొట్టడానికే! రాష్ట్రాన్ని ఏ విధంగా విభజించాలన్న దానిపై కాంగ్రెస్‌పార్టీకే ఇంకా ఓ అవగాహన లేదు. హైదరాబాద్‌పై రెండు, మూడు ఆప్షన్‌లు వున్నాయని చెప్పడంతోనే వాళ్ల అవగాహన రాహిత్యం అర్థమవుతుంది. హైదరాబాద్‌పై ఎన్ని ఆప్షన్‌లున్నాయో కూడా ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. రాష్ట్ర విభజనకు ముందు తేల్చాల్సింది హైదరాబాద్ అంశాన్నే! హైదరాబాద్‌ను తెలంగాణకిస్తారా? లేక యూటీ చేస్తారా? లేదా ఉమ్మడి రాజధానిగా పెడతారా? ప్రత్యేకరాష్ట్రంగా ప్రకటిస్తారా? అన్నదానిపై తేలిస్తేనే విభజన సమస్యకు వెంటనే పరిష్కారముంటుంది. రాజధాని నగరంపై ఏమీ తేల్చకుండానే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడమంటే రాష్ట్రాన్ని నాశనం చేయడమే అవుతుంది. కాంగ్రెస్ ఒకప్పుడు ఈ దేశ రాజకీయాలలో తిరుగులేని శక్తి. కేంద్రంలో పూర్తిస్థాయి మెజార్టీతో అధికారాన్ని దక్కించుకున్న చరిత్ర కాంగ్రెస్‌కు తప్ప మరో పార్టీకి లేదు. అలాంటి పార్టీ నిరంకుశ నిర్ణయాలతో ఒక్కో రాష్ట్రంలో పతనమవుతూ వస్తుంది. పశ్చిమబెంగాల్, ఉత్తర ప్రదేశ్, బీహార్, తమిళనాడులలో పూర్తిగా భూస్థాపితమైన కాంగ్రెస్ తన తర్వాత సమాధికి ఆంధ్రప్రదేశ్‌లో ఇటుకరాళ్లను సిద్ధం చేసుకుంటుంది.

## 'అంతర్'జాతీయం

- వచ్చే లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరిస్తుందని ఏసీ నీల్సన్ - ఏబీపీ న్యూస్‌సర్వేలో వెల్లడైంది. ప్రధానమంత్రిగా అత్యధికులు నరేంద్ర మోడీ వైపే మొగ్గచూపుతున్నట్లు ఆ సర్వే పేర్కొంది.
- ఆస్ట్రేలియా ఎన్నికల్లో టోనీ అబాట్ కూటమి ఘన విజయం సాధించి, ఆరేళ్ల లేబర్‌పార్టీ పాలనకు తెరపడింది. అబాట్ ఆస్ట్రేలియా ప్రధానిగా బాధ్యతలు చేపడుతున్నారు.
- ప్రధాని మన్మోహన్‌సింగ్ అసమర్థత వల్ల రూపాయి చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతుందని గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ విమర్శించారు. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఆర్థికశాస్త్రంలో డాక్టరేట్ పొందిన మన్మోహన్‌సింగ్ వైద్యం వికటించి రూపాయి ఆసుపత్రి పాలైందన్నారు.
- శాస్త్రీయ ఆధారాల ప్రాతిపదికన జన్యుమార్పిడి పంటలను అనుమతించడం, లేక అనుమతించక పోవడంపై భారత్ ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని అమెరికా విత్తన కంపెనీ మాన్‌శాంటో కోరింది. 2002లో ప్రవేశపెట్టిన బిటిపత్తి విత్తనం భారత్‌లో 90శాతం పత్తిపంటను ఆక్రమించింది. 2010లో భారత ప్రభుత్వం బిటీ వంకాయ పంటను వాణిజ్యపరంగా అమ్మకూడదని ఆదేశాలిచ్చింది.
- ఉత్తరప్రదేశ్ మాజీగవర్నర్ రమేష్‌భండారి(85) ఈ నెల 7వ తేదీన కన్నుమూసారు. చాలాకాలంగా ఆయన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు.
- కాంబోడియాలో జరిగిన వివాదాస్పద ఎన్నికలలో కాంబోడియన్ పీపుల్స్ పార్టీ గెలిచినట్లు ఆ దేశ ఎన్నికల సంఘం ధృవీకరించింది.
- ప్రపంచంలోని 200 గొప్ప విశ్వవిద్యాలయాలలో అమెరికాకు చెందిన మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హార్వర్డ్ యూనివర్శిటీలు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. మూడోస్థానంలో బ్రిటన్‌కు చెందిన కేంబ్రిడ్జి యూనివర్శిటీ నిలిచింది. భారత్‌కు చెందిన ఒక్క యూనివర్శిటీ కూడా ఈ 200యూనివర్శిటీల్లో లేకపోవడం గమనార్హం.
- ప్రముఖ షూటర్, 2004ఒలింపిక్స్ రజత విజేత రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ బీజేపీలో చేరారు. సైన్యం నుండి స్వచ్ఛంద పదవీవిరమణ చేసిన రాథోడ్, రాజ్‌నాథ్‌సింగ్ నరేంద్రమోడీల సమక్షంలో పార్టీలో చేరారు.
- నగదు బదిలీ పథకం ద్వారా జనవరి 1 నుండి ఇప్పటివరకు 480కోట్ల రూపాయలను లబ్ధిదారుల ఖాతాలకు జమచేసామని, 90లక్షల మంది వినియోగదారుల ఖాతాల్లో ఇది జమయిందని కేంద్రప్రభుత్వం వెల్లడించింది.

## వార్త వ్యాఖ్య

వార్త :- హైదరాబాద్‌పై రెండుమూడు ఆప్షన్‌లు. - హోంమంత్రి షిండే.
వ్యాఖ్య :- *మీకొక స్థిరమైన ఆలోచన లేనట్లుంది.*

వార్త :- ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ భద్రత కల్పిస్తాం. - రాజ్యసభలో చిదంబరం.
వ్యాఖ్య :- *భద్రంగా వున్నవారిని అభద్రతలోకి నెట్టి మళ్లీ భద్రత కల్పిస్తామంటారా?*

వార్త :- ఎంపీ స్థానాల కోసమే విభజన తీర్మానం. - మాజీమంత్రి గాదె వెంకటరెడ్డి.
వ్యాఖ్య :- *సీట్లు కోసం కాకపోతే దేశ ప్రయోజనాల కోసం పనిచేసే అలవాటు కాంగ్రెస్‌కు లేదుగా!*

వార్త :- మహిళలు... రక్షణ కోసం కత్తితో వెళ్లండి. - శిల్పాశెట్టి.
వ్యాఖ్య :- *రాజకీయపార్టీలు ఇక మహిళలకు ఉచితకత్తుల పంపిణీ పథకాన్ని పెడతాయేమో!*

వార్త :- దేశంలో వున్నది తుగ్లక్‌పాలన. - చంద్రబాబు.
వ్యాఖ్య :- *తుగ్లక్ స్వతంత్రంగానన్నా నిర్ణయాలు తీసుకునేవాడు.*

వార్త :- కీలుబొమ్మ ప్రధాని రాజీనామా చేయాలి. - ఎమ్మెల్సీ నన్నపనేని.
వ్యాఖ్య :- *కీలుబొమ్మ రాజీనామా చేస్తేనేమీ, చేయకుంటేనేమీ?*

వార్త :- డిజిపి పదవీకాలాన్ని పొడిగించొద్దు. - మాజీమంత్రి శంకర్‌రావు.
వ్యాఖ్య :- *మళ్లీ మిమ్మల్ని అరెస్ట్ చేస్తారని భయమా?*

వార్త :- మీరు సమైక్యవాదులా? విభజన వాదులా? - చంద్రబాబును నిలదీసిన సమైక్యాంధ్ర ఐకాస.
వ్యాఖ్య :- *ప్రస్తుతానికి రెండుకళ్ల వాది.*

వార్త :- అభివృద్ధి భారతం విద్యార్థుల చేతుల్లోనే. - సిబిఐ పూర్వ జె.డి లక్ష్మీనారాయణ.
వ్యాఖ్య :- *అవినీతి భారతం నాయకుల చేతుల్లో వున్నట్లా?*

వార్త :- రాయలతెలంగాణకు అనుమతించండి. - జె.సి.దివాకర్‌రెడ్డి.
వ్యాఖ్య :- *మీరు రాయలసీమ పరువు తీస్తున్నారు.*

వార్త :- తెలంగాణ ఏర్పాటును ఏ శక్తీ ఆపలేదు. - కేసీఆర్.
వ్యాఖ్య :- *విదేశీ శక్తి తప్పితే...*

వార్త :- కాంగ్రెస్ అంటేనే అవినీతి. - మోడీ
వ్యాఖ్య :- *హిందుత్వం అంటే బీజేపీ అన్నట్లా?*

PDF Compressor Free Version



జెండాలు వదలి...

## ఉద్యమఅజెండాతో రండి...

సీమాంధ్ర ప్రజల ఆకాంక్షను గుర్తించి రాజకీయ నాయకులు జెండాలు, అజెండాలు లేకుండా సమైక్య రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలోకి రావాలని సమైక్య రాష్ట్ర పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు డిఆర్‌ఓ బి.రామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో ఉపాధ్యాయ సంఘాలు, ఎన్జీఓల జిల్లా అధికారుల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ సమైక్య ఉద్యమం పూర్తిగా అహింసా పద్ధతిలో శాంతియుతంగా నిర్వహిస్తామన్నారు. సేవ్ ఆంధ్రప్రదేశ్ సభ విజయవంతమైన స్ఫూర్తితో ఉద్యమాలను విస్తృతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు సి.రవీంద్రబాబు మాట్లాడుతూ తెలంగాణ నేతలు ఎన్ని ఆటంకాలు కల్పించినా రాళ్ళు విసిరి దాడిచేసినా సేవ్ ఆంధ్రప్రదేశ్ సభ విజయవంతమైందన్నారు. అదనపు జాయింట్ కలెక్టర్ సిహెచ్ పెంచలరెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజులు మరింత కఠినంగా ఉంటాయన్నారు. కళారూపాలు, కరపత్రాలు, పాటల ద్వారా పల్లెల్లో ప్రచారం సాగిస్తామన్నారు. సామూహిక నిరాహారదీక్షలు, ప్రతి ఇంటిపై సమైక్యజెండా ఎగురవేసేందుకు, జిల్లా సరిహద్దులను తాకుతూ భారీ మానవహారాలు నిర్మించడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కోటేశ్వరరావు, మెప్మా పిడి కమలకుమారి, తెలుగుగంగ డిప్యూటీకలెక్టర్ పద్మావతి, డిఆర్‌డిఏ పిడి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

## రాష్ట్ర విభజనకు ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోం

### వాణిజ్య పన్నుల ఉద్యోగులు

రాష్ట్ర విభజనకు ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని ఏపీఎన్జీ గెజిటెడ్ వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి స్పష్టంచేసారు. సమైక్యాంధ్రకు మద్దతుగా మంగళవారం నగరంలోని నర్తకి సెంటర్ వద్ద వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మెజార్టీ ప్రజలు సమైక్యాంధ్రనే కోరుకుంటున్నామని ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించిన సేవ్ ఆంధ్రప్రదేశ్ సభతో తెలంగాణవాదుల గుండెల్లో భయం పట్టుకుందన్నారు. కేంద్రమంత్రులు, ఎంపీలు రాజీనామాలు చేసి ప్రజా ఉద్యమంలో కలవాలని డిమాండ్ చేసారు. ఇప్పటికైనా యుపిఏ ప్రభుత్వం కళ్లుతెరచి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేసారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగులు, గెజిటెడ్ ఉద్యోగులు, డ్రైవర్స్ అసోసియేషన్, ఆడిటర్లు పాల్గొన్నారు.

## మంద కృష్ణ దిష్టిబొమ్మ దహనం

నెల్లూరు కూడలి నుంచి వి.ఆర్.కళాశాల వరకు ఈనెల 10న సమైక్యాంధ్ర దళిత జేఏసీ మందకృష్ణ మాదిగ దిష్టిబొమ్మను ఊరేగించి నినాదాలు చేస్తూ దహనం చేసారు. కార్యక్రమంలో సమైక్యాంధ్ర దళిత జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆమంచర్ల చిరంజీవి మాట్లాడుతూ మందకృష్ణమాదిగ కుటిలబుద్ధి మార్చుకోవాలని, లేకుంటే సీమాంధ్ర ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారన్నారు. ఎవరు డబ్బు ఇస్తే వారికి మద్దతు పలికే నైజం మందకృష్ణదని, గుంటూరు సభకు అతడు పిలుపునిస్తే సీమాంధ్రలో వున్న దళితులంతా వస్తారని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సమైక్యాంధ్ర జేఏసీ దళిత కోకన్వీనర్ ఏడుకొండలు, జిల్లా కన్వీనర్ జి.వేణు, జిల్లా కోకన్వీనర్ సుబ్బరాయుడు, విద్యార్థి జిల్లా కన్వీనర్ సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు సృజనాత్మకత అవసరం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మెహజబీన్

విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాల్లో సృజనాత్మకత కలిగి ఉండాలని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి మెహజబీన్ పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులోని భక్తవత్సలనగర్ కెఎన్‌ఆర్ పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలుగు భాషపై అభిరుచి, ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అప్పుడే ఏ రంగంలోనైనా రాణించవచ్చన్నారు. పెరసం సభ్యులు గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ మెహజబీన్ నెల్లూరువాసి అని, ఆమె సిఏయం హైస్కూల్లో, డికెబ్ల్యూ కళాశాలలో చదువుకున్నారని తెలిపారు. స్త్రీల హక్కుల కోసం, బాలల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్నారన్నారు. అనంతరం పదవతరగతి విద్యార్థులు మెహజబీన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ బి.సుభద్రాదేవి, స్కూలు ప్రధానోపాధ్యాయులు ఎం.విజయ్‌ప్రకాష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పిల్లలు ఆదర్శభావాలు అలవర్చుకోవాలి...**

పిల్లలు చిన్ననాటి నుంచి ఆదర్శభావాలు అలవర్చుకోవాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కవయిత్రి మెహజబీన్ పేర్కొన్నారు. నెల్లూరు టౌన్‌హాలులో ఈ నెల 8వ తేదీన పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో పదవతరగతి వాచకంలోని గద్యభాగంలో స్ట్రీట్‌చిల్డ్రన్ పాఠాన్ని రచించిన ఆమెకు ఆత్మీయసన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు చాట్ల నరసింహారావు, పెరసం అధ్యక్షుడు షంషుద్దీన్, కార్యదర్శి సుభద్రాదేవి, మోపూరు పెంచలనరసింహం, అవ్వారు శ్రీధర్‌బాబు, గుండాల నరేంద్రబాబు, తోట సులోచన పాల్గొన్నారు.

గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలకు

## ఇ-గవర్నెన్ గుర్తింపు

ఇంజనీరింగ్ వాచ్ పత్రికాసంస్థ ఆధ్వర్యంలో జూన్ నెల 23, 2013 తేదిన యుఎన్ పబ్లిక్ సర్వీస్ డే సందర్భంగా భారతదేశంలో ఉన్న 100ఇంజనీరింగ్ కళాశాలల్లో జిల్లాకు ఒకటి చొప్పున ఇ-గవర్నెన్ క్యాంపస్‌గా మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎన్ఐసి డా॥మోనీ, ఢిల్లీ యూనివర్శిటీ సభ్యులు డా॥సంజీవ్‌సింగ్ సభ్యులుగా వున్న కమిటీ ద్వారా ఎంపిక చేసినట్లు గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏఓ కె.గోపాలరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ధృవీకరణ పత్రాన్ని న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ లిసెగ్రాండే, యుయన్ వారిచే కళాశాల ప్రిన్సిపల్ డా॥జి.సుబ్బారావు అందుకున్నారని తెలిపారు.

## ఐసెట్ కౌన్సిలింగ్

నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్‌లో ఈనెల 10న ఐసెట్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎంసిఏ కళాశాలల్లో ప్రవేశాల కోసం జరిగిన ఈ కౌన్సిలింగ్‌లో మొదటిరోజు 1వర్యాంకు నుంచి 20వేల ర్యాంకు వరకు రెండవరోజు ఇరవై వేలఒకటో ర్యాంకు నుంచి నలభై వేల ర్యాంకు వరకు కౌన్సిలింగ్ జరిగింది. కౌన్సిలింగ్ ప్రక్రియను కన్వీనర్ జడ్.రమేష్‌బాబు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15వతేదీ వరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.


కావలి బ్రాహ్మణసంఘ

## వార్షికోత్సవం

కావలి బ్రాహ్మణమహాసంఘాల 3వ వార్షికోత్సవం ఈ నెల 15వ తేదీ ఆది వారం సాయంత్రం కావలిలోని టిటిడి కల్యాణ మండపంలో జరుగుతుందని, కావున కావలి ప్రాంతంలోని బ్రాహ్మణులంతా సభకు విచ్చేసి జయప్రదం చేయాలని నిర్వాహకులు ఎ.సాయిశ్రీధర్, యం.రాజేంద్రలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభగల ఉత్తమ బ్రాహ్మణ విద్యార్థులకు బహుమతులందజేయడం జరుగుతుందన్నారు.

ఆత్మకూరులో...

## మహమ్మారి డెంగీ



నెల్లూరుజిల్లా ఆత్మకూరు మండలంలోని డెంగీ విషజ్వరాలు ఎక్కువవుతున్నాయి. గతనెలలో మూడేళ్ళ చిన్నారి మృతి చెందగా ఇప్పటికీ దాదాపు 10మందికి పైగా డెంగీవ్యాధితో చెన్నైలో చికిత్స పొందుతున్నారు. వైద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఏకలవ్యనగర్, ఎరుకులసానినగర్, ఒందూరుగుంట, ఏపీఎస్సార్ కాలనీతో పాటు పేరారెడ్డిపల్లి బిసికాలనీలో డెంగీకేసులు నమోదయ్యాయి. ఎరుకలసానినగర్‌కు చెందిన బుర్రా హర్షిణి(11) డెంగీ జ్వరంతో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి తీవ్రం కావడంతో సోమవారం చెన్నైకు తరలించారు.

## పెళ్లి రిజిస్ట్రేషన్‌లకి స్పందన కరువు...

కల్యాణ మండపాల్లో, దేవాలయాల్లో, గృహాల్లో వివాహాలు జరిగినా తప్పనిసరిగా వివాహ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గతంలో ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినప్పటికి అది ఆశించినంతగా కార్యరూపం దాల్చటంలేదు. ప్రజల్లో సరైన అవగాహన రావడం లేదు. ఉద్యోగరీత్యా విదేశాల్లో నివసిస్తున్న వారు తప్ప మిగతావారు పెళ్లి రిజిస్ట్రేషన్ పట్ల అంతగా స్పందించడంలేదు. నేటి సమాజంలో మహిళలు ఎంతో మంది వరకట్న పిశాచికి బలి అవుతున్నారు. సరైన ఆధారాలు లభించక నేరస్తులు తప్పించుకుంటున్నారు. పెళ్లి రిజిస్ట్రేషన్‌కి చట్టబద్ధత వుంది. వధూవరుల పూర్తి వివరాలు సంతకాలు ముగ్గురు సాక్షుల వివరాలతో సహా పెళ్లి రిజిష్టరు సమయంలో అధికారులు సేకరిస్తారు. ఇలాంటి సందర్భాల్లో నేరంచేసిన వారు తప్పించుకొనే దాఖలాలు ఉండవు. అసలు మ్యారేజి రిజిష్టరు అంటే ఏమిటి, అది ఎలా జరుపుతారు, దానికి కావలసిన సమాచారం తదితర వివరాలలోకి వెళితే హిందూ వివాహ చట్టం, ప్రత్యేక వివాహచట్టం ప్రకారం సబ్‌రిజిష్ట్రార్లు వివాహాలను రిజిస్ట్రేషన్లు చేస్తారు. హిందూవివాహ చట్టం 1955వ సంవత్సరం ప్రకారం హిందువులకు మాత్రమే వర్తిస్తుంది. ప్రత్యేక వివాహచట్టం 1954వ సంవత్సరం ప్రకారం భారతదేశంలో గల పౌరులు అందరికి వర్తిస్తుంది. ఇది వరకే అయిన వివాహము రిజిష్టరు చేసేందుకు హిందూ వివాహ చట్టం అవకాశం కల్పిస్తుంది. వధువుకు 18సం॥లు, వరునకు 21సం॥లు పూర్తి అయి వుండాలి. రిజిస్ట్రారు ముందు ఇరు పార్టీల వారు తప్పనిసరిగా హాజరుకావాలి.

**పెళ్ళిళ్ళ రిజిస్ట్రేషన్ అమలుపై రాష్ట్రాలకు సుప్రీం ఆదేశం:**

పెళ్ళిళ్ళు రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేస్తూ 2006లో జారీచేసిన ఆదేశాలు అన్ని రాష్ట్రాలు అమలుచేయాలని కూడా సుప్రీంకోర్టు గతంలో సూచించింది. అయినా పెళ్లి రిజిస్ట్రేషన్ల విషయంలో స్పందన అంతంత మాత్రంగానే వుంది.

## ప్రతిభావంతులైన బలిజ విద్యార్థులకు సహాయం

సింహపురి శ్రీకృష్ణ దేవరాయ సేవాసమితి ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన బలిజ విద్యార్థిని, విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌ను మంజూరుచేయడం జరుగుతుందని సేవాసమితి అధ్యక్ష కార్యదర్శులు ముత్యాల చంద్రమోహన్‌రాయలు, ఆర్.నాగేశ్వరరాయలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నెల్లూరు జిల్లాలోని అన్ని మండలాలలో 2012-13సంవత్సరంలో 10వతరగతిలో అత్యధిక మార్కులు సంపాదించిన ప్రతిభావంతులైన ఆర్థికంగా వెనుకబడిన బలిజ విద్యార్థుల నుండి పూర్తి వివరాలతో దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. పదవతరగతి మార్కుల మెమో, కుల, ఆదాయ ధృవీకరణ పత్రములతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు అక్టోబర్‌నెల 5వతేదీలోగా అధ్యక్షులు, ముత్యాల చంద్ర మోహన్, సింహపురి శ్రీ కృష్ణ దేవరాయ సేవాసమితి డోర్‌నెం.13-1-325శ్రీ హనుమాన్ కాంప్లెక్స్ ఆచారీవీధి, నెల్లూరుకు పంపుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99853 53711 సెల్‌నెంబరులో సంప్రదించాలని కోరారు.

## అస్తవ్యస్త ట్రాఫిక్‌ను సరిదిద్దనున్న అధికారులు

నెల్లూరు నగర ట్రాఫిక్‌ను బాగుచేయాలని ఎట్టకేలకు జిల్లా అధికారులకు మనసు కలిగినట్టుంది. ఈనెల 10న కమీషనరు డి.జాన్‌శ్యాంసన్, డీఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ డీఈలు, ట్రాఫిక్ సిఐలు కలిసి నగరంలోని ముఖ్య కూడళ్ళు ముత్తుకూరు గేటు, విఆర్‌సి, ఏసి కూరగాయల మార్కెట్, ఆర్‌టీసీ, కెవిఆర్ పెట్రోల్‌బంక్, ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. ముందుగా సిగ్నల్‌లైట్లకు మరమ్మత్తులు, ఫుట్‌పాత్‌లు సరిదిద్దడం, పాదచారులు రోడ్డు దాటేందుకు జీబ్రాలైన్లు వేయడంతో పాటు ఫ్రీలెఫ్ట్ మలుపు ఉపయోగించేలా చర్యలు చేపట్టడం, రద్దీ ప్రాంతంలో పార్కింగ్ స్థలాలు నిర్దేశించడం, సిటీబస్సులు, ఆటోలు రోడ్లపై ఇష్టప్రకారం నిలపడాన్ని నిరోధించడం చేయాలని నిర్ణయించారు. చూద్దాం వీరి కార్యాచరణలో త్వరగా నెల్లూరు ట్రాఫిక్ బాగుపడుద్దేమో!

## నెల్లూరు బస్సులపై రాళ్ళ దాడి

సమైక్యాంధ్రకు మద్దతుగా హైదరాబద్‌లో ఇటీవల జరిగిన సేవ్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి హాజరై తిరిగి నెల్లూరుకు వస్తున్న బస్సుల పై తెలంగాణవాదులు రాళ్ళు రువ్వారు. దీంతో డ్రైవరు, క్లీనరు, ఓ ఉద్యోగికి గాయలయ్యాయి. సభ ముగిసిన అనంతరం హైదరాబాద్ నుంచి నెల్లూరు బయలు దేరిన 25 బస్సుల్లో ఎనిమిది బస్సులపై తెలంగాణవాదులు దాడులు చేశారు. ఇందిరా పార్కు నుంచి బర్కత్‌పూర్ రాగానే తెలంగాణవాదులు రాళ్ళతో దాడి చేసి పారిపోయారు. దీంతో బస్సుల అద్దాలు పగిలిపోయాయి. నెల్లూరు జిల్లా ఉద్యోగులు ప్రయాణిస్తున్న బస్సుపై రాత్రి 8.35 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ వద్ద కొందరు రాళ్ల దాడి చేశారు. దీంతో డ్రైవర్ బస్సును వేగంగా తీసుకెళ్ళడంతో ప్రమాదం తప్పింది. బస్సులోని శ్రీనివాస్ అనే ఉద్యోగికి చేతికి గాయమైంది.

**XVIII ASST**
**IN THE CITY CIVIL.COURT AT CHENNAI**
**O.S.No. 6886 of 2011**

**Canara Bank,**
Royapettah Branch,
Chennai - 14 ... Plaintiff

Vs

**Mr. M.Althaf Hussian Mohammed** .... Defendant

To
**Mr. M.Althaf Hussain Mohammed,**
S/o M.Ismail,
No. 8/833, Muslim Street,
Ranganayakulapet,
Nellore -1, AndhraPradesh

The above suit is filed against the defendant herein to recover a sum of Rs. 33,149-31 with costs and further interest. Wherein, the Hon'ble Court was pleased to order substituted service for your appearance returnable by 21-08-2013. Therefore, kindly take notice that you should appear either in person or through your lawyer on the said date at 10.30 a.m. before the said court, failing which the matter will be heard and decided in your absence.

**S. Kesavan**
Counsel for Plaintiff

PDF Compressor Free Version





ఈ నెల 9వ తేదీన నెల్లూరు కాపువీధిలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద జరిగిన పూజల్లో పాల్గొన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి మరియు ఆనం కుమారులు, కోడళ్లు, కుమార్తె, మనవళ్ళు మనుమరాళ్ళు

## నెల్లూరు కబుర్లు



# నరకయాత్ర

ఆర్టీసీ సమ్మె ప్రయాణీకులకు చుక్కలు చూపిస్తుంది. ఆర్టీసీలో మొన్నటివరకు ఒక యూనియన్ సమ్మెకు దూరంగా వుండింది. దీంతో కొన్ని బస్సులన్నా తిరిగాయి. ఇప్పుడు ఆ యూనియన్ కూడా సమ్మెకు దిగడంతో ఏ డిపో నుండి ఒక్క బస్సు కూడా బయటకు రావడం లేదు. దీంతో ప్రయాణీకులకు పూర్తిగా రైళ్లు లేదంటే ప్రైవేట్ వాహనాలే దిక్కయ్యాయి. రైళ్లలో రిజర్వేషన్లు దొరకడం మహా గగనంగా వుంది. అప్పటికప్పుడు ప్రయాణాలు పెట్టుకున్నవారికి ప్రైవేట్ వాహనాలే శరణ్యం. ప్రయాణీకుల అవసరాన్ని ప్రైవేట్ ట్రావెల్స్ నిలువుదోపిడీగా మలచుకుంటున్నాయి. మొన్న వినాయకచవితికయితే వరుసగా సెలవులొచ్చాయి. పండుగకు ముందు సొంత ఊర్లకు రావడానికి, పండుగ తర్వాత తాము వుంటున్న నగరాలకు పోవడానికి ప్రయాణీకులు ఛార్జీల రూపంలో భారీగానే సమర్పించుకోవాల్సివచ్చింది.

## ఆకర్షించిన జేసీబీల ర్యాలీ




విభజనను వ్యతిరేకిస్తూ ఎక్సలేటర్ల ఓనర్స్ అసోసియేషన్ మొన్న ఒకరోజు జేసీబీలతో నెల్లూరులో నిర్వహించిన ర్యాలీ చూపరులను ఆకర్షించింది. అయ్యప్పగుడి నుండి మొదలుపెట్టి మినీబైపాస్, విఆర్‌సి, గాంధీబొమ్మల మీదుగా ఆత్మకూరు బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అసోసియేషన్ నాయకులు, జేసీబీ డ్రైవర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## తాగుబోతు కేసీఆర్



రాష్ట్ర విభజనకు నిరసనగా నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7న చిల్డ్రన్‌పార్క్ రోడ్డులో కెసిఆర్ వేషధారికి మద్యాభిషేకాన్ని నిర్వహించారు. మురళీ ఆర్ట్స్ అధినేత శింగంశెట్టి మురళీమోహన్ ఆధ్వర్యంలో కెసిఆర్‌కు ఘన సన్మానం దిగ్విజయ్‌సింగ్‌తో మద్యాభిషేకంలాంటి వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. కెసిఆర్, దిగ్విజయ్‌సింగ్ వేషధారులను పెన్నానదిలో నిమజ్జనంచేసి అందరూ అక్కడే తద్దిన భోజనం చేశారు. వివిధ పాత్రల్లో మురళీమోహన్, జయచంద్ర, బాషా, వెంకటేశ్వర్లు నటించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, పాముల రమణయ్య, పరదేశీ రఘుకుమార్, దయాకర్ యాదవ్, రవి, తిరుమలశెట్టి సురేష్, బలరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అంచెలవాణి, సుధాకర్, శ్రీనివాసులు, రామకృష్ణ, వెంకటేశ్వర్లునాయుడు పాల్గొన్నారు.

## సమైక్యాంధ్ర గణపతి



రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలని ఆకాంక్షిస్తూ నెల్లూరులోని జెండావీధికి చెందిన స్వర్ణకారుడు షేక్ ముసవీర్ బంగారంతో సూక్ష్మ గణనాథుడి నమూనాను తీర్చిదిద్దాడు. దీంతో పాటు వివిధ ఆకృతుల్లో 11 అతిసూక్ష్మ బంగారు గణనాథులను తీర్చిదిద్దాడు. కేవలం 2గ్రాముల 200మిలీ గ్రాముల బంగారంతో రెండు రోజులు కష్టపడి ఈ నమూనాలను తయారుచేసి అందరి ప్రశంసలు అందుకున్నారు.

## అమ్మవారి మాలధారణ 22 నుండి



విలేకర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న ఆనం వివేకా

నెల్లూరు దర్గామిట్ట లోని శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుండి వచ్చే నెల 13వ తేదీ వరకు శ్రీ రాజరాజేశ్వరి మాలధారణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి చెప్పారు. 10వ తేదీన అమ్మవారి ఆలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివేకా మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి అధ్యక్షులు సన్నపరెడ్డి పెంచలరెడ్డి గత 5ఏళ్లుగా ఎంతో నిష్ఠతో ఈ మాలధారణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారని అభినందించారు. మాలధారణ చేసే భక్తులకు భోజనం, వసతి సమితి ద్వారానే ఏర్పాటు చేస్తున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారి మాలధారణ స్వీకరించి ఆ తల్లి కృపాకటాక్షం పొందాలని కోరారు. ఈ సమావేశంలో సమితి అధ్యక్షులు సన్నపరెడ్డి పెంచలరెడ్డి, ఇఓ నాగేశ్వరరావు, ఛైర్మన్ రత్నం జయరామ్, ఆలయ ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.



### రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం

## అధ్యక్షుడిగా లక్కాకుల

విశ్రాంత పోలీసు అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఈ నెల 10వ తేదీన నెల్లూరులోని పోలీసు అధికారుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఈ సంఘానికి అధ్యక్షులుగా విశ్రాంత సిఐ లక్కాకుల ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షుడిగా విశ్రాంత సిఐ కె.వి.రమణయ్య, కార్యదర్శులుగా ఎస్.సత్యనారాయణ, ఓ.వి.రాజు, కోశాధికారిగా జి.సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులుగా టి.జయరామయ్య, ఏఎన్ఎం బాషా, బి.రాయల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశ్రాంత గెజిటెడ్ పోలీసు అధికారులు ఎ.రాధ, జె.శ్రీహరిరావు, ఏఆర్‌కె రాజు, టి.నరసింహారావులను గౌరవసలహాదారులుగా ఎన్నుకున్నారు.

## సిఎంఆర్ మట్టి వినాయక ప్రతిమలు



మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న మావూరి వాసు

నెల్లూరులోని కనకమహల్ కూడలిలో వున్న సిఎంఆర్ షోరూంలో యాజమాన్యం వినాయక చవితి మట్టి ప్రతిమలను నెల్లూరు వాసులకు పంపిణీ చేయడం అందరికీ సంతోషాన్ని కలిగించింది. వాతవరణ కాలుష్యానికి కారణం కాకుండా వుండేట్లు మట్టితో చేసిన వినాయకులను సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసులు ఐదేళ్ళ నుంచి ఇలా అందిస్తున్నారు. దాదాపు పదివేల ప్రతిమలను ఆయన పంపిణీ చేసారు. సిఎంఆర్ షోరూం ముందు వినాయక చవితికి 50వేల రుద్రాక్షలతో తయారు చేసిన 10అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసారు. అంతే కాకుండా పర్యావరణ కాలుష్యం లేకుండా చేసే వినాయక ప్రతిమలను రూపొందించి షోరూమ్‌లో ప్రదర్శనకు వుంచిన వారికి న్యాయనిర్ణేతల పరిశీలనతో బహుమతులు అందించారు.

### యాచకులకు

## వాసవి అల్పాహారం



నెల్లూరులోని రంగనాయకులస్వామి దేవస్థానం ముందుండే యాచకులకు ఈ నెల 7న వాసవిక్లబ్, వనితక్లబ్‌లు సంయుక్తంగా అల్పాహారాన్ని పంపిణీ చేసాయి. వాసవీ వారోత్సవాల్లో భాగంగా చేసిన ఈ పంపిణీ కార్యక్రమంలో వాసవిక్లబ్ అధ్యక్షులు చలువాది శరత్‌కుమార్, వనిత అధ్యక్షురాలు చలువాది ఉమారాణి, వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, మల్లి, కిషోర్‌బాబు, పబ్బిశెట్టి శ్రీనివాసులు, గోపి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ తిప్పలు



గ్యాస్ సిలిండర్‌కు ఆధార్‌కార్డుతో లింకు పెట్టడంతో వినియోగదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఆధార్‌కార్డు ప్రక్రియ సంపూర్ణంగా లేదు. 50శాతం మందిదాకా ఇంకా కార్డులు పొందాల్సి వుంది. వాస్తవానికి ఆధార్‌కార్డులకు గ్యాస్‌కు లింకు చేస్తూ రాష్ట్రంలోని కొన్ని జిల్లాలను మాత్రమే పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నారు. కాని కొందరు అధికారుల అత్యుత్సాహం మూలంగా మన జిల్లాలోనూ ఆధార్‌కార్డులకు గ్యాస్‌కు లింకు పెట్టారు. చాలామంది వినియోగదారులు ఆధార్‌కార్డులను తీసుకోవాల్సి వుంది. గ్యాస్ బుక్ చేయడానికి వెళితే ఏజన్సీ నిర్వాహకులు ఆధార్‌కార్డులు తీసుకు రమ్మని చెబుతున్నారు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

## ఆగని గుట్కాల విక్రయం



సాక్షాత్తూ న్యాయస్థానాలే నిషేధం విధించినా నెల్లూరులో గుట్కాల విక్రయం మాత్రం ఆగడం లేదు. గుట్కాలు ఆరోగ్యానికి హానికరమని వైద్యులు, స్వచ్ఛంధసంస్థలు మొత్తుకుంటున్నాయి. క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులకు గుట్కాలు దారితీస్తున్నాయి. అయినా వీటిని నమిలేవాళ్లలో అవగాహన రావడం లేదు. గుట్కాలకు అలవాటుపడ్డ వాళ్లు వాటిని నములుతూనేవున్నారు. పాన్ షాపులు, టీబంకులు, చిల్లరకొట్లలో వాటిని చాటుమాటుగా అమ్ముతూనే వున్నారు.

### అన్నీ తగ్గినా...

## ఆ వ్యాపారం తగ్గడం లేదు



నెలన్నరరోజులుగా కొనసాగుతున్న సమైక్యాంధ్ర సమ్మె వల్ల అన్ని వ్యాపారాలు వడిపోయాయి. కొన్ని వ్యాపారాలు సగానికి తగ్గిపోగా, మరికొన్ని లావాదేవీలు పూర్తిగా ఆగిపోయాయి. రాష్ట్రం ఇంత అల్లకల్లోలంగా వున్నా, ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నా మద్యం వ్యాపారం మాత్రం తగ్గడంలేదు. ఏ బార్లు చూసినా, ఎక్కడ వైన్‌షాపులు చూసినా ఎప్పటిలాగే కళకళలాడుతున్నాయి. రాష్ట్ర విభజన వల్ల మద్యపాన ప్రియులకు వచ్చిన నష్టమేమీ లేదనుకున్నారో ఏమో, ఆ వ్యాపారానికి మాత్రం ఏ లోటూ రానీయడం లేదు.

## ఖైదీ దొరికాడు

ఓ హత్య కేసులో నెల్లూరు కేంద్ర కారాగారంలో జీవితఖైదు శిక్ష అనుభవిస్తూ నెల్లూరు పెద్దాసుపత్రిలో కడుపునొప్పి అని చికిత్స పొందుతూ పోలీసుల కళ్లుగప్పి పరారైన పులి శ్రీనివాసులును పోలీసులు రెండోరోజే పట్టుకున్నారు. ఆకుతోట హరిజనవాడకు చెందిన అరుణ అనే అతని ప్రియురాలు పరారు కావడానికి సహకరించింది. పోలీసులు అతను ఆకుతోట హరిజనవాడలో వున్నట్లు పసిగట్టి వెంటనే పట్టుకున్నారు. అతని ప్రియురాలు అరుణపై కూడా కేసు నమోదు చేసారు.

సింహపురి సమాచారం

# విభజనపై రెఫరెండం పెట్టాలి


సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి

రాష్ట్ర విభజనపై రెఫరెండంపెట్టాలని నెల్లూరు రూరల్ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరులోని విఆర్‌సి కళాశాలలో ఆదివారం ప్రజా సంఘాలతో నిర్వహించిన చర్చావేదికలో ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో 51 శాతం ప్రజలు రాష్ట్రం సమైక్యంగా ఉండాలనే కోరుకుంటున్నారన్నారు. అందువల్లే హైదరాబాదులో ఎన్జీఓలు నిర్వహించిన సభ విజయవంతమైందన్నారు. తెలంగాణాలో రౌడీలు, గుండాలు ఉద్యమాన్ని నిర్వహించగా సీమాంధ్రలో ప్రజలు, ఉద్యోగులు స్వచ్ఛందంగా సమైక్య ఉద్యమాన్ని ముందుకు నడుపుతున్నారన్నారు. ఈనెల 15న నగరంలోని వివిధ దేవాలయాల్లో సమైక్యాంధ్రకు మద్దతుగా సుదర్శనయాగం, రుద్రయాగం, చండీయాగం నిర్వహిస్తామన్నారు. ఈ ఉద్యమంలో రైతులను భాగస్వామ్యం చేసేందుకు త్వరలో నెల్లూరులో సహస్ర వాహనయాత్ర చేపడుతున్నామన్నారు. అసెంబ్లీలో తెలంగాణా బిల్లును అడ్డుకునేందుకు అన్ని పార్టీల ఎమ్మెల్యేలు కలిసిరావాలన్నారు. అసెంబ్లీలో తెలంగాణాబిల్లు వీగిపోతే, పార్లమెంట్‌లో రెండింతలమెజార్టీ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, భానుశ్రీ, ఎన్‌డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, డిసిఎంఎస్ అధ్యక్షులు సుమంత్‌రెడ్డి, వివిధ ఉద్యోగ, విద్యార్థి, వ్యాపార, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం చేయాలి


రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకాంత్

రెడ్‌క్రాస్ ద్వారా అందించే వివిధ సేవలను మరింత విస్తృతం చేయాలని నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ ఆదేశించారు. నెల్లూరు మద్రాసుబస్టాండు వద్ద ఉన్న రెడ్‌క్రాస్ రక్తనిధిని కలెక్టర్ ఈ నెల7న సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలను పరిశీలించి పలువిషయాలు అడిగి తెలుసుకున్నారు. చిత్తశుద్ధితో పనిచేసి ప్రజలకు సేవలందించాలన్నారు. ఆసుపత్రుల్లో రక్తం లేకుండా ఎవరూ ఇబ్బందులు పడకూడదని, అవసరమైన రక్తాన్ని అందించాలని, రక్తదాన శిబిరాలను ఏర్పాటుచేసి రక్తాన్ని సేకరించాలని కోరారు. నెల్లూరు ఆర్‌డివో మాధవీలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సుధాకర్, టీబీ ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మావతి, రెడ్‌క్రాస్ కోశాధికారి మోహన్‌లాల్ జైన్, గాంధీ ఆశ్రమ కన్వీనర్ కృష్ణారెడ్డి, సభ్యులు ఏవీకృష్ణారావు స్పాస్టిక్స్ సెంటర్ కన్వీనర్ కృష్ణవేణి, మోర్గ్ కన్వీనర్ కృష్ణమూర్తి, ఏవీఆర్ క్లినిక్ మెడికల్ ఆఫీసర్ రమణయ్య, రెడ్‌క్రాస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జూలియానా, రెడ్‌క్రాస్ మేనేజర్ విజయ్‌కుమార్ బాబు పాల్గొన్నారు.

# చిన్నారి చికిత్సకు చేయూత


విరాళంచెక్కును అందజేస్తున్న కోట గురుబ్రహ్మం

చిన్నతనంలోనే కొండంత బాధను మోయడమంటే ఇదేనేమో! ఆ బాధకు కొంత ఉపశమనమన్నా కలిగితే బాగుంటుంది. కదా! చిన్నారి రమ్యశ్రీ బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతుండడం తెలిసిందే. ఆ చిన్నారికి చికిత్సకోసం మానవతా దృక్పథంతో నెల్లూరు ఐరన్స్ హార్డువేర్, పెయింట్ వ్యాపారుల సంఘం ముందుకొచ్చి చేయూతనిచ్చింది. ఈనెల 7న ఆ సంఘం అధ్యక్షుడు కోట గురుబ్రహ్మం 38,121/-రూ॥ల చెక్కును రమ్యశ్రీ తల్లికి రంగనాయకులపేటలోని సంఘ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంలో సంఘ కార్యదర్శి పెండేల సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి రాజశేఖర్, సభ్యులు సోమిశెట్టి వెంకటరత్నం, భాస్కర్, కృష్ణారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## అలుపెరగకుండా పోరాడి...

# ఆగిన గుండె

*ఆ గొంతు ఆగలేదు.. సమైక్యనినాదాన్ని మార్మోగించింది...*

***అలా అరుస్తూ అరుస్తూనే ఆ గొంతు ఒక్కసారిగా మూగపోయింది. ఆ గుండె ఆగిపోయింది. సమైక్యాంధ్ర ఉద్యమానికి ఊపిరులూదిన ఓ ఉపాధ్యాయుడు ఈ పోరాటంలో అలసి తన ఊపిరి కోల్పోయాడు.***

నాయుడుపేట పాతబస్టాండ్ వద్ద ఉద్యోగ ఐకాస నేతలు నిర్వహిస్తున్న సమైక్యాంధ్ర రిలే నిరాహారదీక్ష కార్యక్రమంలో 10వ తేదీ విషాదం చోటుచేసుకుంది. ఈ శిబిరంలో ఆవేశంగా ప్రసంగిస్తూ బట్ట శంకర్‌యాదవ్ అనే ఉపాధ్యాయుడు గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. అన్నమేడు జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న శంకర్‌యాదవ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శిగా, అఖిలభారత యాదవ మహాసభ కార్యదర్శిగా కూడా పని చేస్తున్నారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో ప్రసంగిస్తూ ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది.

తన సామాజిక బాధ్యతలను నిర్వర్తించడంలో శంకరయ్యకు మంచిపేరుంది. సారా ఉద్యమం, అక్షరదీపం వంటి కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని ప్రజలను చైతన్యవంతం చేసిన చరిత్ర ఆయనది. జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా విద్యార్థుల నుండి ఆ సబ్జెక్ట్‌లో వందశాతం ఫలితాలను సాధిస్తున్నారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో ఉద్యమాలలో పాల్గొన్నారు. ఆయన మృతిపట్ల మాజీఎంపీ నందమూరి హరికృష్ణతో పాటు ఎమ్మెల్యే పరసా రత్నం, జిల్లా జేఏసీ నాయకులు సి.హెచ్.పెంచలరెడ్డి, బి.రామిరెడ్డి, సమైక్యవాదులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఆయన మృతికి సంతాప సూచకంగా 11వ తేదీ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ పాటించారు.

# కళ్యాణ వైభోగం...!

## కార్తీక్ - మీనాక్షి

జిల్లా కాంగ్రెస్ నాయకుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి - శ్రీమతి శ్యామలల కుమారుడు **కార్తీక్ - మీనాక్షి** (హైదరాబాద్ వాస్తవ్యులు కె.వేణుగోపాల్‌రెడ్డి-సుష్మరెడ్డిల కుమార్తె)ల వివాహ రిసెప్షన్ సెప్టెంబర్ 8వ తేదీ హైదరాబాదులోని తాజ్‌డెక్కన్ హోటల్‌లో జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహా పలువురు రాజకీయ, అధికార అనధికార ప్రముఖులు ఈ రిసెప్షన్ వేడుకలలో పాల్గొని కొత్త దంపతులను దీవించారు. కార్తీక్ - మీనాక్షిలకు 'లాయర్' ఆశీస్సులు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి


నూతన వధూవరులతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వధూవరుల తల్లిదండ్రులు

# వైభవంగా "ఓనం" వేడుకలు



మలయాళీల సంప్రదాయ పండుగ ఓనం వేడుకలు నెల్లూరు నగరం టౌన్‌హాల్‌లో ఆదివారం వైభవంగా జరిగాయి. కేరళ నుంచి ఇక్కడకొచ్చి స్థిరపడిన వేలాదిమంది మలయాళీలు వేడుకలకు హాజరవడంలో సందడిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కేరళలో శాస్త్రీయ నృత్యాలను తిరువాతిరకాళి, ఒప్పనా, మార్గమ్‌కాళి, నృత్యాలను కేరళ యువతులు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకొన్నారు. అనంతరం ఓనం అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. శాస్త్రీయ సంగీత కచేరి చిన్నారులు. యువతుల నృత్యాలు, మలయాళం పాటలు, చిన్నారుల ఫ్యాన్సీ డ్రస్ పోటీలతో సంబరాలు అంబరాన్నితాకాయి. అనంతరం బహుమతులను ప్రదానం చేశారు.

**ప్రభుత్వ సహాయం అందిస్తాం... - జిల్లా కలెక్టర్ శ్రీకాంత్**

నెల్లూరు జిల్లాలో ఉన్న 10వేల మంది మలయాళీలకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలను అందిస్తామని నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఓనం వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగాపాల్గొని మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరూ కలిసి చేసుకునే ఓనంను జిల్లాలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గొలగమూడిలో నిర్మించిన కేరళ ఆయుర్వేద వైద్యశాల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మలయాళీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నందకుమార్, సంఘం నాయకులు వీసీ ప్రవీణ్ సి.ఎస్.శివరామన్, ఎన్. విశ్వనాథన్, ఎం.చంద్రన్, మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు ఆర్డీఓగా దేశిరెడ్డిగారి కోదండరామిరెడ్డి



నెల్లూరుజిల్లా ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారిగా చిత్తూరుజిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ల్యాండ్ ఏపీడీగా పనిచేస్తున్న దేశిరెడ్డిగారి కోదండరామిరెడ్డి బదిలీ నియమితులయ్యారు. ప్రమోషన్‌పై చిత్తూరుజిల్లాలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఏపిడిగా పనిచేస్తుండిన ఈయన గతంలో వైయస్సార్‌జిల్లా పులివెందుల, ప్రొద్దుటూరు, అనంతపురం జిల్లాలోని గుంతకల్లు, ధర్మవరం, పుట్టపర్తిలో తహశీల్దారుగా విధులు నిర్వర్తించివున్నారు.

PDF Compressor Free Version



## కదంబం

### అజేయశక్తిగా..

నిఖిలేశ్వర్, హైదరాబాద్
91778 81201.

ఆకాశం నుదుటిపై
సంధ్యారాగపు రక్త తిలకం
మోదుగుపూల రంగుగా
అనీతలమంతా అల్లుకున్న
అమ్మాయిలే
వికసించే మానవమూర్తులు.

సృష్టి సౌందర్య ప్రతీకలుగా
భూసహనానికి సజీవంగా
జ్వలించే అజేయశక్తిగా
ఆకాశమంతా విస్తరించిన స్త్రీ.

మగ మృగాల చేతుల్లో
అసహాయగా అబలగా
బలైపోవడం ఇంకెంతకాలం?

చిత్తకార్తె కుక్కలకంటే
హీనంగా
కామంతో పిచ్చెక్కిన
ఉన్మాదులను నిర్మూలించే
మానవ సంకల్పమే
మన నిరంతర ఆయుధం!!

## వెంకటగిరి పోలేరమ్మ జాతరకు సన్నాహాలు

నెల్లూరుజిల్లా వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర నిర్వహణకు బుధవారం తొలి చాటింపుతో సన్నాహాలు సంప్రదాయ బద్ధంగా ప్రారంభమయ్యాయి. ప్రతియేటా వైభవంగా జరిగే ఈ జాతర నిర్వహణకు స్థానిక రాజాలనుంచి దేవస్థానం వర్గాలు అనుమతి పొందే కార్యక్రమాన్ని బుధవారం ఉదయం పూర్తిచేశారు. దేవస్థానం మాజీచైర్మెన్ కృష్ణారెడ్డి, మేనేజర్ రామచంద్రరావు, సభ్యులు జానకిరామయ్య, శ్రీహరికోట కృష్ణయ్య, గోపాల్‌నాయుడు తదితరులు సాంప్రదాయ నిర్వాహకులతో కలిసి రాజాల నివాసానికి వెళ్లారు. రాజకుటుంబీకులు రాంప్రసాద్ యాచేంద్ర సమక్షంలో వారి ప్రతినిధులు వెంకటముని, కమిటీ చైర్మెన్‌కు తాంబూలం ఇచ్చి జాతర నిర్వహణకు తమ సానుకూలతను తెలిపారు. అనంతరం గ్రామశక్తి ఆలయం వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించి చాటింపువేసే సంప్రదాయ నిర్వాహకులను పాలకవర్గం పురమాయించింది. మళ్ళీ వచ్చే బుధవారం 18న రెండో చాటింపువేస్తారు. ఈ నెల 25, 26తేదీల్లో జరుగు జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. జాతరలో భక్తులు మొక్కుబడులు తీర్చుకునేందుకు వీలుగా ఈ నెల 22వ తేదీ నుంచి ఘటోత్సవం ప్రారంభమవుతోంది.

## మానసిక వికలాంగుల ర్యాలీ



సమైక్యాంధ్ర కోసం మేముసైతం అంటూ ఈ నెల 7న మానసిక వికలాంగులు వీల్‌ఛైర్స్‌పై ర్యాలీ జరపడం అందర్నీ ఆశ్చర్యపరచింది. నెల్లూరులోని ఎన్‌యమ్‌డి ఛారిటీస్, ప్రగతి ఛారిటీస్, డా॥ బిందుమీనన్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మానసిక వికలాంగులు, మెడికల్ రెప్రజెంటేటివ్స్, మెడికల్ ఏజన్సీస్ బాధ్యులు జెండావీధి నుంచి గాంధీబొమ్మ వరకు సమైక్యాంధ్ర నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీని జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ కె.సుధాకర్ జెండా ఊపి ప్రారంభించగా డాక్టర్ అజయ్‌బాబు, డాక్టర్ జనకుమార్‌రెడ్డి, ఎన్‌యమ్‌డి ఛారిటీస్ సయ్యద్ నిజాముద్దీన్, కొండా శివారెడ్డి, ఖలిద్, షారుఖ్, షానవాజ్, ఉమర్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని ఎంట్రన్స్‌టెస్ట్‌లో పాసైన రాహుల్

### శ్రీను గల్పిక

అది పెద్దసంఖ్యలో తలతిక్క నాయకులున్న ఢిల్లీ మహానగరం. సోనియాగాంధీ వుంటున్న టెన్‌జనపథ్. ప్రధాని మన్మోహన్‌సింగ్, కేంద్ర మంత్రులు ఆంటోనీ, కమలనాథ్, వీరప్పమొయిలీ, షిండే, చిదంబరం, చిరంజీవి, అంబికాసోని, మనీష్ తివారీ, పనబాక లక్ష్మి, జ్యోతిరాదిత్య, ఎంపీలు వి. హెచ్.హనుమంతరావు, మధుయాష్కీ, కాంగ్రెస్ నేతలు దిగ్విజయ్‌సింగ్... ఇలా అందరూ కార్లలో అక్కడకు చేరుకుంటున్నారు. టెన్‌జనపథ్ గేటు వద్దే కొందరు భిక్షగాళ్లు అడుక్కుంటున్నారు. మన్మోహన్‌సింగ్ కారు దిగాడు. ధర్మ హృదయం కలిగిన దాతలారా... ధర్మం చేయండి బాబయ్యా అని అక్కడున్న ఓ భిక్షగాడు అడుక్కున్నాడు. అతనిని చూసి మన్మోహన్ సింగ్‌కు జాలేసింది. వెంటనే జేబులో నుండి ఓ రూపాయిబిళ్ల తీసి అతని సత్తుగిన్నెలో వేసి పండుగచేసుకో అని 'పోకిరి' సినిమాలో బ్రహ్మానందం మాదిరిగా అన్నాడు. ఆ భిక్షగాడు రూపాయి చేతిలోకి తీసుకుని 'పోకిరి' సినిమాలో ఆలీ మాదిరిగా... ఈ రూపాయితో ఏం పండుగ చేసుకోమంటార్సార్... ఉగాదా, హోళీనా, క్రిస్‌మస్సా, రంజానా... ఏం పండుగ చేసుకోమంటారో చెప్పండి. ఈ రూపాయితో ఒక చాక్లెట్ రాదు, ఒక బిస్కెట్ రాదు... ఒక గుండుసూది కూడా రాదు. ఏం పండుగ చేసుకోమంటారు... ఈ రూపాయికి ఏమన్నా విలువుంటేగా ఏదన్నా చేసుకోవడానికి. ఇదిగో ఈ వందరూపాయలు... సారీ సారీ... వందకు మాత్రం ఏమొస్తుంది నా బొంద.. ఈ 500రూపాయలు తీసుకోండి... వెళ్తూవెళ్తూ పావ్‌బాజీ, రోటీ తినండి... మంచి స్వీట్‌లస్సీ ఒకటి తాగండి... పనేంలేదుగా... ఖాళీగా వుంటే.. 'జంజీర్' సినిమాకు వెళ్లి మీరే పండుగ చేసుకోండి అంటూ 500రూపాయల నోటు మన్మోహన్‌సింగ్ చేతిలో పెట్టాడు. అతని మాటలతో మన్మోహన్‌సింగ్‌కు నోట మాట రాలేదు. అంత ఆశ్చర్యంలోనే అక్కడ భిక్షగాడు పెట్టిన బోర్డు చూసాడు. దానిమీద ఇలా వ్రాసి వుంది... "రూపాయి విలువ దారుణంగా పడిపోయిన దృష్ట్యా వందరూపాయలకు తక్కువ ధర్మం స్వీకరించబడదు" అని. మన్మోహన్‌సింగ్ ఆ షాక్ నుండి తేరుకుని టెన్‌జనపథ్‌లోకి వెళ్లాడు. అక్కడ విశాలమైన హాల్‌లో కాంగ్రెస్ నేతలంతా కూర్చున్నారు.

అప్పుడే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ అక్కడకు వచ్చారు. వి. హెచ్.హనుమంతరావు, మధుయాష్కీలు వచ్చిన వారందరికీ టీ, కాఫీ, జ్యూస్‌లు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. రావాల్సిన వాళ్లంతా వచ్చేసాక సోనియాగాంధీ మాట్లాడడం మొదలుపెట్టింది. ఏ వయసులో జరగాల్సిన అచ్చటముచ్చట ఆ వయసులో జరగాలంటారు. అట్లాగే నా కొడుకు రాహుల్‌కు కూడా ఈ వయసులో జరపాల్సిన ముచ్చట జరిపేద్దామనుకుంటున్నానని అంది. ఆమె ఆ మాట అనగానే, పొన్నం ప్రభాకర్ లేచి... రాహుల్‌కు పెళ్లనుకుని 'పెళ్లి కళ వచ్చేసిందే బాల' అంటూ పాటందుకున్నాడు. వెంటనే సర్వే సత్యనారాయణ కూడా "శ్రీరస్తు శుభమస్తు... శ్రీకారం చుట్టుకుంది పెళ్లిపుస్తకం" అంటూ 'పెళ్లిపుస్తకం'లోని పాట పాడసాగాడు. అవి విని సోనియా కోపంతో... ఆపండి మీ పెళ్లిగోల... అబ్బాయి పెళ్లికి ఇప్పుడేం తొందర... ఇంకా ఆ వయసు రాలేదు. అయినా అబ్బాయికి లేని తొందర మనకెందుకు... అతని తిప్పలేవో అతను పడతాడు... ఇప్పుడు అబ్బాయికి వయసొచ్చింది పెళ్లికి కాదు, ప్రధాని పదవి చేపట్టడానికి. ప్రధాని అయ్యాకనే అబ్బాయికి పెళ్లి చేయాలనుకుంటున్నాను. అబ్బాయి ప్రధాని పదవి చేపట్టడానికి అన్ని అర్హతలున్నాయో లేదో మీరే తేల్చిచెప్పండి అని కోరింది. వెంటనే చిదంబరం లేచి... మన దేశ తొలిప్రధాని ఎవరు? అని ప్రశ్నించాడు. మా తాత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని రాహుల్ తడుముకోకుండా సమాధానం చెప్పాడు. గులాంనబీ ఆజాద్ లేచి... మన దేశ రాజధాని ఏది అని ప్రశ్నించాడు. ఢిల్లీ అంటూ రాహుల్ టకీమని చెప్పేసాడు. అంబికాసోని వుండి... ఓట్లు సంపాదించాలంటే మనమేం చేయాలని అడిగింది. దానికి రాహుల్... ప్రజలను కులాలు, మతాలు, వీలైతే ప్రాంతాలవారీగా విభజించాలన్నాడు. వీరప్ప మొయిలీ లేచి... అయోధ్యలోని బాబ్రీ మసీదు ఎందుకు కూలింది అంటూ ప్రశ్నను సంధించాడు. ఆ సమయంలో మా కుటుంబసభ్యులు ప్రధాని పదవిలో లేకపోవడం వల్ల అని రాహుల్ అన్నాడు. ఈ దేశపు తొలి మహిళా ప్రధాని ఎవరు అని ఏ.కె.ఆంటోని అడిగాడు. మా నానమ్మ ఇందిరాగాంధీ అని రాహుల్ వెంటనే చెప్పేసాడు. ఈ దేశంలో ఎన్ని రాష్ట్రాలున్నాయి అని షిండే ప్రశ్నించాడు. ఇప్పటికైతే 28 రాష్ట్రాలున్నాయి... వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి 29రాష్ట్రాలు కానున్నాయని రాహుల్ చెప్పాడు. పదికి మధ్యలో సున్నా పెడితే ఏమవుతుందని పనబాక లక్ష్మి అడిగింది. అక్కడున్న నాయకులంతా కూడా... ఇదో పెద్ద ప్రశ్న? పదికి మధ్యలో సున్నా పెడితే 'వంద' అవుతుంది... అది ఒకటో తరగతి కుర్రాడు కూడా చెబుతాడని మనసులో అనుకోసాగారు. కాని రాహుల్ మాత్రం పదికి మధ్యలో సున్నా(0) పెడితే 'పంది' అవుతుందని చెప్పాడు. రాహుల్ ఎంతో లాజిక్‌గా చెప్పిన సమాధానానికి కాంగ్రెస్ నేతలంతా నోరెళ్లబెట్టారు. ఈ దేశంలో ప్రధానిని సైతం శాసించగల పోస్ట్ ఏదన్నా వుందా? అని చిరంజీవి అడిగాడు. దానికి రాహుల్... ఉంది. యూపీఏ ఛైర్‌పర్సన్ పదవి అని రాహుల్ చెప్పాడు. రాహుల్ టకాటకా మని సమాధానాలు చెప్పడం చూసి... అహ్మద్‌పటేల్ లేచి... ప్రధాని పదవి చేపట్టడానికి ఇంతకంటే అర్హుడెవరుంటారు మేడమ్, ఇంతకంటే అర్హతలేం కావాలి. ప్రధాని పదవికి అన్ని విధాలా అర్హత సాధించారు రాహుల్‌బాబు అని అనసాగాడు. అప్పుడు మన్మోహన్ లేచి... "హౌస్‌వెస్టింగ్... నో ఫెస్టివల్", "ఇన్‌ఫ్రంట్ దేర్ ఈజ్ క్రొకోడైల్ ఫెస్టివల్". ఇప్పుడు నేనడిగే దిమ్మతిరిగే ప్రశ్నకు సమాధానం చెబితేనే ఆయనకు ప్రధాని పదవికి అర్హత వచ్చినట్లు అని... 2004-2013ల మధ్య భారతదేశ ప్రధాని ఎవరు అని ప్రశ్నించాడు. వెంటనే రాహుల్... ఆ కాలంలో మన దేశానికి ప్రధానమంత్రే లేడుగా అని చెప్పాడు. ఆ సమాధానంతో మన్మోహన్‌తో పాటు మిగతా వారికి కూడా తలలు 250కిలోమీటర్ల వేగంతో తిరిగాయి.

## శంకర్ త్యాగం వృధా కాదు

సమైక్యాంధ్ర కోసం నెల్లూరుజిల్లా నాయుడుపేటలో రిలే నిరాహారదీక్ష చేస్తూ ఉద్వేగానికి లోనై మంగళవారం మరణించిన ఉపాధ్యాయుడు బట్టా శంకర్‌యాదవ్ త్యాగం వృధాకాదని, ప్రజలను ఓట్ల కోసం సీట్ల కోసం మోసం చేసే టీడిపి, వైసిపి పార్టీలు తమ రాజకీయ యాత్రలను ఆపాలని, ఈ నెల 15నుంచి సమైక్యాంధ్ర ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నట్లు నెల్లూరురూరల్, నగర శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు నగరం, వీసిసెంటర్‌లోని నగర కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆనం వివేకానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని రెండుగా చీల్చినా ఫర్వాలేదని లేఖ ఇచ్చిన చంద్రబాబునాయుడు ఆత్మగౌరవం పేరుతో, సమన్యాయం పేరుతో సన్నాయినొక్కులు నొక్కిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలు నేడు ప్రజలను మోసం చేస్తూ ఓట్ల కోసం, సీట్ల కోసం రాజకీయ బస్సుయాత్రలు చేస్తున్నారని, ఈ యాత్రలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

నెల్లూరు నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ సమైక్యాంధ్ర కోసం రిలేనిరాహారదీక్ష చేస్తూ మరణించిన ఉపాధ్యాయుడు శంకర్ యాదవ్ కుటుంబానికి ప్రభుత్వం నుండి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ అధ్యక్షులు చాట్ల నరసింహారావు, యువజన కాంగ్రెస్ నాయకులు బర్నాబాసు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

కేంద్ర ప్రభుత్వం సమైక్య ప్రకటన చేసేంత వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎంపిడిఓల అసోసియేషన్ జిల్లా నాయకులు దుత్తలూరు మండల ఇన్‌చార్జి ఎంపిడిఓ గోపీనాథ్ హెచ్చరించారు. రాష్ట్ర విభజనను విరమించుకోవాలని కోరుతూ మంగళవారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి పంచాయతీరాజ్ శాఖకు చెందిన పలువురు ఉద్యోగులు నెల్లూరు నగరంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. 42రోజులుగా ఉద్యోగులు తమ విధులను బహిష్కరించి ఉధృతంగా ఉద్యమిస్తుంటే కేంద్రప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. వీఆర్‌సి, ఆత్మకూరు బస్టాండ్, ఆర్టీసీ, చిన్నబజార్, నర్తకీసెంటర్, గాంధీబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల నుంచి ర్యాలీగా తిరిగివచ్చి జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు నెల్లూరు విజయకుమార్, ఇంజనీరింగ్ అసోసియేషన్ నాయకులు బాబురావు, శ్రీధర్, మున్వర్, వెంకయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, భీమిరెడ్డి, సుజిత్ పలువురు ఎంపిడిఓలు, ఈఓపీఆర్డీఓలు, జెడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## శరవేగంగా వైద్యకళాశాల నిర్మాణం

నెల్లూరు పెద్దాసుపత్రి ఆవరణలో మొదలుపెట్టిన ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణం అత్యంత వేగంగా జరుగుతుంది. ఇప్పటికే ఒక స్లాబ్ పూర్తయ్యింది. ఈ వైద్యకళాశాలను జిల్లాకు మంజూరు చేయడానికి కృషిచేసిన మంత్రి ఆనం నారాయణరెడ్డి నిర్మాణ పనులపై ప్రత్యేకపర్యవేక్షణ చేస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరానికల్లా ఈ కళాశాల నిర్మాణాన్ని పూర్తిచేసి అడ్మిషన్లను మొదలుపెట్టించడమే లక్ష్యంగా నిర్మాణాన్ని పరుగులుపెట్టిస్తున్నారు.

## మేషం

అశ్వని, భరణి, కృతిక 1 పాదము

అధికారులకు పని వత్తిడి, ఉద్యోగులకు పనిభారం మరియు ప్రభుత్వ వత్తిడి పబ్లిక్ వత్తిడి బాగుంటుంది. సోదర వర్గానికి మేలు జరుగుతుంది. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, రావలసిన బాకీలపై హామీలు లభిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఇబ్బందులను నష్టాలను అధిగమిస్తారు. ఆదాయం పెరుగుతుంది. కొత్తపెట్టుబడు లకు అవకాశాలు, స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు.

## వృషభం

కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

సాంఘిక సేవా రంగాలలో ప్రముఖ పాత్ర వహిస్తారు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. అధికారులతో సామరస్యంగా మెలుగుతారు. కాని పనిభారం ఎక్కువ కాగలదు. వృత్తి పరంగా బాగా పుంజుకుంటారు. ఆదాయం బాగుంటుంది. శుభకార్యాలలో ప్రాముఖ్యత వహించడం, దూరప్రయాణాలుంటాయి. కుటుంబ సౌఖ్యము బాగుంటుంది.

## మిథునం

మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

క్రొత్త పెట్టుబడులకు అవకాశాలు, విలువైన వస్తువులు కొనడం, స్థిరాస్తుల లావాదేవీలు జరపడం జరుగుతుంది. బిడ్డల చదువుల పై దృష్టిపెడతారు. ఆర్థిక పర్థితి బాగుండి, వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉంటుంది. ఆదాయమునకు తగ్గ ఖర్చులుంటాయి. మీ ఆలోచనలు సలహాలు వల్ల ఇతరులకు మేలు కలుగుతుంది. శుభకార్యాలు నిర్ణయ స్థితికి వస్తాయి.

## కర్కాటకం

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. శుభకార్యాలలో పాల్గొనడం మరియు ప్రయాణాల ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. బంధుమిత్రులతోను, అధికారవర్గంతోను పంతాలుపట్టింపులకు పోకుండా సర్దుకొని పోవడం మంచిది. వ్యాపారాలలో ఆటంకాలు తొలగి ఆర్థికంగా బలపడతారు. ఆదాయం పెరుగుతుంది. వృత్తి జీవనం కలవారికి శ్రమ ఉంటుంది.

## సింహం

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

దూర ప్రయాణాలు శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. ఉద్యోగులకు పనిభారం, ప్రభుత్వం వల్ల సమస్యలుంటాయి. సమ్మానాలు, సభలలో పాల్గొంటారు. వ్యాపార వృద్ధి కొరకు చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. విలువైన వస్తు వస్త్రాలు కొనుగోలు జరుపుతారు.

## కన్య

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్ర 1, 2 పాదాలు

యూనియన్ కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబ సౌఖ్యముంటుంది. బంధువర్గంతో విభేదాలు ఏర్పడవచ్చును. కొత్త పెట్టుబడులు, కొత్త షేర్ల విషయంలో తొందరవద్దు. ఆర్థికావకాశాలు సన్నగిల్లి ఆశించిన ఆదాయం ఉండదు. శుభకార్యలలో పాల్గొనడం, దూర ప్రయాణాలు. వీటి వల్ల ఖర్చులు పెరుగుతాయి. స్థిరాస్తుల లావాదేవీలందు జాగ్రత్త అవసరం.



బ్రహ్మశ్రీ స్వయంపాకులశ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 13.09.2013 నుండి
తేది. 19.09.2013 వరకు

ఈ వారం మేషంలో కేతువు, మిథునంలో గురువు, కర్కాటకంలో కుజుడు, సింహంలో రవి మరియు 17 తేది నుండి కన్యలో రవి, కన్యలో బుధుడు, తులలో శుక్ర శని రాహువులు, ధనుర్మకర కుంభమీన రాశులందు చంద్రుడు సంచరిస్తారు.

## పంచాంగము:

తేది. 18.09.2013
అనంతపద్మనాభ వ్రతము.

తేది 19 గురువారము సాయంకాలము నుండి మహాలయ పక్ష ప్రారంభము.

ముహూర్తములు లేవు.

## భాద్రపదమాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 13 | శుక్ర | అష్టమి | ఉ॥గం.7.58ని॥ |
| | పిదప | నవమి | రా॥గం.5.32ని॥ |
| తేది. 14 | శని | దశమి | రా॥గం. 3.06ని॥ |
| తేది. 15 | ఆది | ఏకాదశి | రా॥గం.12.36ని॥ |
| తేది. 16 | సోమ | ద్వాదశి | రా॥గం. 10.21ని॥ |
| తేది. 17 | మంగళ | త్రయోదశి | రా॥గం. 8.17ని॥ |
| తేది. 18 | బుధ | చతుర్దశి | రా॥గం.6.26ని॥ |
| తేది. 19 | గురు | పూర్ణిమ | సా॥గం.4.57ని॥ |

## తుల

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వస్తు వాహన గృహ రిపేర్లు అదనంగా ఉంటాయి. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత తక్కువ. అనుకున్న పనులు టెన్షన్ పెట్టుతూ సాగుతాయి. ప్రముఖులతో సన్నిహితంగా మెలగడం ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో మార్పులు చోటు చేసికొనవచ్చును. కొత్త ప్రణాళికలు పథకాలతో వ్యాపారవర్గాలు అభివృద్ధి చెందుతాయి. ఆదాయం తృప్తికరంగా ఉంటుంది.

## వృశ్చికం

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వ్యాపార వృత్తి రంగాల వారికి అవకాశాలు మంచివి చేజరిపోవచ్చును. కాని సామాన్య ఆదాయానికి లోపంరాదు. శుభకార్యాల ఖర్చులు, ప్రయాణాలు అదనంగా ఉంటాయి. కుటుంబ వ్యవహారాలలో, ఆర్థిక వ్యవహారాలను కడుజాగ్రత్తతో నిర్వహించవలసి ఉంటుంది. కుటుంబ సభ్యుల వ్యతిరేకత కొంత బాధిస్తుంది. బిడ్డ విద్యాఉద్యోగ, వివాహ విషయాలలో శ్రద్ధ పెట్టుతారు.

## ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వ్యాపార వర్గాల వారికి ఆర్థిక పరిస్థితి బాగుండి ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలలో తొందరపడవద్దు. షేర్లు లాభాలనందిస్తాయి. శాస్త్ర సాంకేతిక వృత్తి రంగాల వారు ప్రతిభను చూపుతారు మరియు గుర్తింపు పొందుతారు. నూతన వస్తు వాహనాలు సమకూర్చుకొనడం, కొత్త పెట్టుబడులకు అవకాశాలు ఆహ్వానాలు అందుతాయి.

## మకరం

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

అనుకున్న పనులు సరిగా జరగక టెన్షన్ పడుతుంటారు. మీ అభిప్రాయాలను సున్నితంగా తెలపడం మంచిది. అనవసర వివాదాలలో జోక్యం చేసికొనవద్దు. ఆర్థిక విషయాలపై దృష్టి పెట్టి ఇబ్బందుల నుండి బయటపడే ప్రయత్నాలు చేస్తారు. వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలు తప్పిపోవచ్చును. ఆదాయం సామాన్యంగా ఉంటుంది.

## కుంభం

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

అవసరాలకు ఋణాలు చేయవలసి రావచ్చును. శుభకార్య ఖర్చులు ప్రయాణ ఖర్చులు, కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. అనుకున్న పనులు సానుకూలం కాగలవు. ఇంటాబయట వ్యవహారాలలో తొందరపాటువద్దు. రవాణా, పరిశ్రమలరంగాల వారికి నిర్వహణ ఇబ్బందులుంటాయి. దైవ, సామాజిక కార్యాలలో పాల్గొంటారు.

## మీనం

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

యూనియన్ కార్యక్రమాలలో పాల్గొనడం, అధికారుల నుండి వత్తిడి పెరుగుతుంది. పెట్టుబడులకు ఆహ్వానాలు అందుకొనడం ప్రోత్సహించబడటం జరుగుతుంది. ఖర్చులు పెరిగినా భారమనిపించవు. వృత్తివ్యాపార రంగాల వారికి అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది.

# మన సంస్కృతి మహోన్నతం

### వివిధ పాఠశాలల్లో ఘనంగా వినాయకచవితి వేడుకలు

భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని యస్ఆర్‌కె విద్యాసంస్థల అధినేత పి.కృష్ణమూర్తి పేర్కొన్నారు. 7వతేదీన వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇస్కాన్ సిటీలో ఉన్న యస్ఆర్‌కె నెక్స్‌ట్ జనరేషన్ స్కూల్లో విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. పాఠశాల క్రాఫ్ట్ టీచర్ రమణప్రసాద్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను తయారుచేసి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దిలీప్‌కుమార్, ప్రధానోపాధ్యాయిని శోభితారెడ్డి పాల్గొన్నారు.

**రత్నం స్కూల్లో :**

వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని డైకస్‌రోడ్డులో ఉన్న డాక్టర్ కిషోర్‌రత్నం నైస్ ఫౌండేషన్ స్కూల్లో విఘ్నేశ్వరపూజలు నిర్వహించారు. జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ఆర్కిడ్ స్కూల్లో :**

నెల్లూరు నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న ఆర్కిడ్ స్కూల్లో వినాయక చవితికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించారు. కరస్పాండెంట్ అరుణారెడ్డి, అకడమిక్ ప్రిన్సిపల్ నిహారికారెడ్డి, డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కిడ్జి స్కూల్లో :**

కిడ్జి స్కూలులో వినాయకుడికి పూజలు నిర్వహించి వినాయకచవితి విశిష్టతను కరస్పాండెంట్ నిహారికారెడ్డి విద్యార్థులకు తెలియజేశారు.

# కేసిఆర్, కోదండరాంలు డూప్లికేట్లు

నెల్లూరు ఏసిసెంటర్‌లో ఈనెల 7న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నెల్లూరు గ్రామీణ, నగర శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు కెసిఆర్, కోదండరాంలపై నిప్పులు చెరిగారు. సమైక్యాంధ్రకు మద్దతుగా హైదరాబాద్‌లో జరిగిన ఎన్జీవోల సభ విజయవంతంకావడం తెలుగు ప్రజల ఆకాంక్షగా పేర్కొంటూ విభజన అనేది కేవలం కెసిఆర్ కోదండరాం మాత్రమే ఆడుతున్న డూప్లికేట్ ఉద్యమమన్నారు. కోదండరాం ఒక ముల్లాలా వ్యవహరిస్తున్నారని, ఎన్జీవోల సభను అడ్డుకునేందుకు టీఆర్ఎస్ గూండాలు చేసిన ప్రయత్నం విఫలమైందన్నారు. తెలంగాణ ప్రజలు ఎక్కడా విభజన కోరుకోవడంలేదని, ఒకవేళ కోరుకొని వుంటే బస్సుల్లో గ్రామాలు దాటి సభకు వేలమంది ఎన్జీవోలు చేరుకోగలిగి వుండేవారు కాదన్నారు. అధ్యాపకుడైన కోదండరాం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నాడని అతని శైలి సిగ్గుచేటుగా వుందన్నారు.

☞ రిజిస్ట్రేషన్లకు బ్రేక్...

# ప్రజలకు షాక్

- ఇసీలు, నకళ్ళు అందక అగచాట్లు
- అడ్వాన్స్ అగ్రిమెంట్లు కాలపరిమితి తీరడంతో టెన్షన్లు



రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ సమైక్యాంధ్రకు సంఘీభావం తెలుపుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్జీఓలు గతనెల 12వతేదీ నుంచి చేపట్టిన సేవ్ ఆంధ్రప్రదేశ్ సమ్మె తీవ్రరూపం దాల్చింది. దీంతో దాదాపు నెలరోజులు పైగా ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. బ్యాంకులలో రుణాలు పొందాలన్నా స్థలాలు, భూములు రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నా ప్రజలకు ఉపయోగకరంగా ఉండే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు మూతపడడంతో ప్రజల కష్టాలు వర్ణనాతీతం. అడ్వాన్సులు ఇచ్చి అగ్రిమెంట్లు వ్రాయించుకున్న వారికి నిర్ణయించుకున్న సమయం దాటిపోవడంతో టెన్షన్లకు గురౌతున్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాలంటే అవసరమయ్యే ఎన్‌కంబెరెన్స్ సర్టిఫికెట్ (ఇసీ)లు రాక నానా అగచాట్లు పడుతున్నారు. భారీగా రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో రిజిస్ట్రేషన్‌శాఖ భారీగా ఆదాయాన్ని కోట్లరూపాయల్లో కోల్పోయింది. ఈ ఉద్యమం ఎప్పుడు తెల్లారుతుందోనని ఎదురుచూస్తున్నారు. ఓ వైపు ఎన్జీఓలకు జీతాలు అందక, పేద మధ్య తరగతి ప్రజలకు సరైన పనులు దొరకక అష్టకష్టాలు పడుతున్నారు. ఈ ఉద్యమంతో భారీగా లావాదేవీలు ఆగిపోయాయి. అగ్రిమెంట్లు వ్రాయించుకోను తటపటాయిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఏదైనా స్థిరాస్తిని విక్రయించాలన్నా వెంటనే కొనే నాథుడు కరువయ్యాడు. దీంతో ఒక్కసారిగా రియల్ ఎస్టేట్ భూంపడిపోయింది. అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు కొనుగోలుకు బ్యాంకు రుణాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# షార్ రోడ్డు దిగ్బంధం

నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేటలో సమైక్యాంధ్ర ఉద్యమం తీవ్రంగా సాగుతుంది. సమైక్యవాదులు రోజుకో రీతిలో నిరసన వ్యక్తంచేశారు. సూళ్ళూరుపేట శ్రీహరికోట మార్గాన్ని షార్ కాంట్రాక్టు కార్మికులు, పేర్నాడు, కొరిడివానులు మంగళవారం దిగ్బందించారు. అటకానితిప్ప వద్ద రోడ్డు పైనే వంటావార్పు చేసి నిరసన తెలిపారు. షార్ వాహనాలతో పాటు అన్ని వాహనాలను అడ్డుకున్నారు. షార్ అధికారులు సిఐఎస్ఎఫ్ సిబ్బంది సాయంతో హుటాహుటిన అక్కడకు చేరుకుని సమైక్యవాదులకు నచ్చజెప్పి తమ వాహనాలను తీసుకెళ్ళారు. ఇక్కడ ఆందోళనతో కొన్ని గంటలపాటు ట్రాఫిక్ స్థంభించిపోయింది.

# ప్రతిభకు ప్రోత్సాహం




నెల్లూరు దర్గామిట్టలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో ఈ నెల 8న పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో పోలీసుల పిల్లలలో ప్రతిభావంతులకు ప్రోత్సాహ కార్యక్రమం జరిగింది. ఇంటర్‌మీడియట్‌లో 900 మార్కులకు పైన వచ్చిన 49మంది, పదో తరగతిలో 90శాతంపైన వచ్చిన 59 మంది విద్యార్థులకు క్యాష్ రివార్డ్, జ్ఞాపిక, సర్టిఫికెట్లను జిల్లా ఎస్పీ రామకృష్ణ ఆయన సతీమణి కామేశ్వరిలు అందజేసారు. కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు మద్దిపోల ప్రసాద్‌రావు ఏఆర్.డి.ఎస్పీశివారెడ్డి, నెల్లూరు నగర, గ్రామీణ డీఎస్పీలు వెంకటనాథ్‌రెడ్డి, బాల వెంకటేశ్వరరావు, పోలీసు అధికారుల సంఘం గౌరవాధ్యక్షులు శ్రీహరి, ఉపాధ్యక్షు సురేష్‌రెడ్డి, కోశాధికారి బాబు సంఘం నాయకులు శివప్రకాష్, పరమేశ్వరి, శ్రీకుమార్‌రెడ్డి, మాధవరెడ్డి, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నరు.

PDF Compressor Free Version





ఈ నెల 9వ తేదీన బోగోలు మండలం, కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన వినాయకచవితి వేడుకల్లో పాల్గొన్న వై.యస్. కుమార్తె షర్మిల, పక్కన కావలి నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జ్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు.



# మనది పేద దేశమా?!

ఈ, ఉతూపద వార్త వ్రాస్తున్నది డా॥ పెళ్ళకూరు జె.పి.రెడ్డి

ఉ = ఉత్తరం = North . తూ = తూర్పు = East . ప = పడమర = West . ద = దక్షిణం = South . ఇంగ్లీషు అక్షరాల క్రింద ఎర్రటి గీతలు కలిపితే NEWS అవుతుంది. 'NEWS' అనగా 'వార్త' లేదా 'వార్తలు' అని అర్థం. ఇది "ఇటీవల ఇలలో ఇంతమంది" అని (Census) సెన్సస్ జనగణన వారాన్ని పురస్కరించుకుని (జనాభా దినోత్సవం) వ్రాసిన వార్తావార్తలు.

అన్నం ఉడికిందా, లేదా అనేదానికి అన్ని మెతుకులూ పట్టుకోనవసరమా? నాల్గు మెతుకులు చాలు అనే విధంగా, మన దేశం యొక్క నలుదిశల్లో 'ఒక్కోదాన్ని గూర్చి తెల్సుకుంటే చాలు' అనే విధంగా రాస్తున్నదిది. ముందుగా మన దేశం గూర్చి, మూడు ముక్కలు... వర్తమాన లెక్కను బట్టి, మన దేశ జనాభా 120కోట్లట. సమ్మతించగల సంఖ్యా ఇది? అన్ని ప్రాంతాల్లోని 'జనగణ' మనదగిన సకల సెన్సస్ డిపార్ట్‌మెంట్లవారి నిజనిర్ధారయేనా ఇది? కాదు, అబద్ధమని నేనంటే నిరూపించగలరా? ఎందుకంటే... నాడు కామరాజ్ నాడార్ గారు పాత గుర్తు 'కాడెద్దుల' కాంగ్రెసుతో, ఇందిరాగాంధీ గారు 'ఆవుదూడ' గుర్తుతో కొత్త కాంగ్రెసుగా పేరుబడి, ఐక్యకాంగ్రెస్ విడివడి, వేరు కాబడింది, అటుపై, నా విద్యార్థి దశలో కొందరొచ్చి, చావు పుట్టుకల నడిగి, తేదీలతో సహా, వ్రాసుకెళ్ళారు. పెమ్మట ప్రిన్సిపాల్ గారి నుండి 21సం॥ల వయసున్నవారి వివరాలు సేకరించి, ఓటు హక్కు కల్పించారు. ఆపై ఇందిరాగాంధీ ప్రధానిగా వుండగా జరిగిన ఈ తంతు మరలా పదేళ్ళకు కూడా కొనసాగింది. అంతే ఆ తర్వాత అంతులేదు. అవి సత్యకాలపు రోజులు, "ఇప్పటి గాంధీల హయాంతో పోలిస్తే"!

ఆ రకంగా ఓటు హక్కు వచ్చి 44సం॥లయింది నాకు, సర్పంచి స్థాయి నుండి, సెంట్రల్ దాకా నా 'ఓటు' ఓటమెరుగదు. మన దేశ జనాభా లెక్కలు (పదేళ్ళకోమారు) తీస్తున్నట్లు పుస్తకాల్లోకి పరిమితమైందేమోగాని, ఆ పని మీద వచ్చి పలకరించినవారు లేరు. నా వద్దకు సెన్సస్ వారు వచ్చి మొన్నటికి 4దశాబ్దాలు. వీలయినంతమందిని అడుగుతుంటాను, వారి సమాధానం బట్టి, ఇటీవల లెక్కల కొరకు సెన్సెస్ వారు కల్సింది 0.0001శాతం మందిని మాత్రమే. సెన్సిటివ్‌గా (సూక్ష్మంగా గమనిస్తే) ఆలోచిస్తే కేవలం సెన్సస్ డిపార్ట్‌మెంట్ వారిదే పూర్తి తప్పుగా భావించలేం. గవర్నమెంట్ వారు 'జనగణ'నకై కావాల్సినంత నిధులు విడుదల చేశారా? వర్షాలకవసరమైన వలువలు, గొడుగులు, అరణ్యాల్లోకెళ్ళడానికి అవసరమైన జీపులు, ఓవర్ డ్యూటీ క్రింద డబ్బులు, కాగితాలు తడవని విధంగా జాగ్రత్తలు, వారి శ్రమకు తగిన శాలరీలు, కొన్ని ప్రాంతాల్లోని వారి వద్ద కెళ్ళడానికి ఇబ్బంది లేని రీతిలో సెక్యూరిటీ సిబ్బందిని, ఇలా అన్ని వనరుల్ని సమకూర్చారా, అని కూడా పరిగణలోకి తీసుకుంటే గణికుల నుండి 'నో' అనే జవాబే వస్తుంది. అలాంటప్పుడు సరైన సంఖ్య ఎలా వస్తుంది? "It lee" అనవసరం. It = ఈ ప్రస్తావన, lee = ఊత, ఆశ్రయం, అనగా ఈ విషయాలపై ఇప్పటి సర్కారును ఆశ్రయించడం వృథా అని.

సిసలైన సత్యసంగతులు :- నా 'ఊతూపద' పద పదార్థానికి ఉత్తరం వైపు ఓ దేశం, తూర్పు పడమర, దక్షిణాల్లో ఒక్కో దేశాన్ని గూర్చి తెల్సుకుందాం. 'North అమెరికా' - మన దేశానికంటే విస్తీర్ణంలో 3రెట్లు పెద్దది. జనాభాలో 4రెట్లు తక్కువ. అనగా మన దేశంలో పదికోట్ల మందిముంటే ఎలాగుండేదో అదీ ఆ అగ్రరాజ్యం!

East = తూర్పు - 'జెకోస్లవేకియా' - వైశాల్యంలో మన ఇండియా కంటే 40ఇంతలు చిన్నదే. కానీ జనాభా కేవలం ఒకే ఒక్క కోటి. ఆ రకంగా చూస్తే, మన దేశ జనాభా 25కోట్లున్నట్లన్నమాట. అది ధనిక దేశమా?

West = 'సౌదీ అరేబియా'నే తీసుకుందాం... అది మనకన్నా 13/4 రెట్లు ఏరియాలో చిన్న, జనాభా పరంగా 21/2కోట్లు. ఆ లెక్కన, మన దేశంలో 42/3 కోట్ల మందిముండివుంటే ఎలా ఉండేదో, అదన్నమాట, ఆకాశహర్మ్యాల అరేబియా దేశం.

South = దక్షిణం - ధరాపట దర్శనంలో (అట్లాస్) మనకు దక్షిణాన గల 'ఆస్ట్రేలియా' రెండుంబావురెట్లు పెద్దది. జనాభా 2కోట్లు, బాగా గమనిస్తే, మన దేశంలో 85లక్షల ప్రజలుంటే భారత్ ఎలాగుండేది? ఊహించుకోండి. అదీ ఆ అహంభావానికి ఆనవాయితీగా అందరూ అనుకునే ఆస్ట్రేలియా ఆర్థికస్థితి.

పోతే, ప్రపంచంలోకెల్లా అత్యంత జనాభాగల దేశంగా చెప్పబడేది 'చైనా'. చైనా మన దేశానికంటే మూడింతల వైశాల్యం గలది. అనాదిగా జనాభాను అరికట్టడం వలన 1.25 రెట్లు మాత్రమే మనకంటే ఎక్కువమంది వున్నారు. (1947లో వారు 70కోట్లు మనం 33కోట్లు అనేది చరిత్ర) కనుక అధికజనాభాని బట్టి చైనాని చిన్నచూపు చూడకూడదు. కాని,... అంత విశాలంగావున్నా, చైనా ప్రభుత్వానిది విశాలహృదయం కాదు. 1965లో దోచుకున్నది చాలదన్నట్లు, ఇంకా మనపై దండయాత్రలు చేస్తూనేవున్నది. ప్రపంచ దేశాలన్నింట్లోకి భూకబ్జా విషయంలో దర్జాగా పేరుగాంచినది 'చైనా' ఒక్కటే. కొద్దిగా అటూ ఇటుగా వ్రాసినట్టి ఈ కౌంట్లు, అకౌంట్లు నా స్వంతం కాదు. 2002 అక్టోబర్ నుండి 17-3-2003 అనగా ఆ అయిదు నెలల వ్యవధిలో అప్పటి మన జాతీయస్థాయి సర్వేయర్‌గారి Vide Lr No. 2669/6/2-A-3/A మరియు 419/62-A-3/A (ఇలా సెక్షన్లు మాత్రం బహుబావుంటాయిలెండి, పెద్ద, పెద్ద చదువులు చదివిన సివిలియన్స్‌కి కూడా అర్థంగాని రకంగా) వ్రాసిన వార్త.(NEWS). ఈ భూతాన్ని (గడచిన కాలాన్ని) ప్రక్కనబెట్టి, వర్తమానం గమనిస్తే (పోల్చిచూస్తే), మన దేశ జనాభా మనకే అర్థమవుతుంది.

2001లో ఆం.ప్ర జనాభా 71/2కోటి, మరాఠా 9.7కోట్లు, తమిళనాడు 5.5కోట్లు, వెస్ట్‌బెంగాల్ 8కోట్లు. 1.4కోట్ల మంది ఢిల్లీ వరకు. ఇప్పుడు వరుసగా వీటిలో 11, 13.5, 8, 12, 4కోట్లుగా చెబుతున్నారు. నాకు తెలిసి 1994లో బెంగుళూరు సిటీ జనాభా 22లక్షలు, ఇప్పుడు 90లక్షలకు పైనే ఉన్నారట. ఈ ఒంట్లు చూస్తే మన దేశ జనాభా 120కోట్లా? కాదు, 200పై మాటే అని నా స్వాభిప్రాయం. అయినా ఉదహరించిన దేశములతో పోలిస్తే... మనది 'సస్యశ్యామల దేశం'. మనకు లేని వనరుల్లేవు. అన్నీ వున్నా, కేవలం జనాభాని అరికట్టలేకపోవడమే లోపం. ఈ లోపం లోకప్రవాదం(అనగా జనవాణి). ఈ ప్రమాద ప్రవాదానికి పౌరాణికంగానైతే బ్రహ్మను అర్చించి అర్థించాలి. కానీ, భృగుమహర్షి శాపమూలాన ఆలయం లేదాయనకు. కనుక లోవిడికారుల(మునుపటి) ప్రశాంత వాతావరణం తెల్సిన లోకజ్ఞాన చిత్తులజిత్తులు(యుక్తులు) పాటించే పాటవ పాలకులెవరైనా వారికి నా సహస్రకోటి 100నాలు.

మొనమెరుపు- మన ఆం.ప్రను చీల్చదల్చినట్లే, దేశాధినే(త్రి)తల ఉరవడి ఇలానే ఉంటూ, స్వార్థపరులైన మరికొన్ని రాష్ట్రాల వారు కూడా వంతపాడి కూస్తే, వాటినీ కోస్తే, కలిమిడిగా ఉన్నవారి మధ్య మంటబెట్టినట్లే. ఇటలీల అంటే ఇక్కడ జరిగిన తంతులాగ అనగా కెనడా వారి సమస్యలకు కెన్యా వార్ని, సౌదీఅరేబియా వారి అవస్థలకు సౌత్‌ఆఫ్రికా, మెక్సికో వారి మనస్తాపాలకు, అక్కడి పాలకులు మలేషియా దేశములతో, ఇటలీ వారి సమస్యలకు ఇండోనేషియా నేతలతో సంప్రదించినట్లుగా నిర్ణయాలు తీసుకుంటే అధిక జనాభా సమస్యతో సంబంధం లేకుండానే, మన దేశం అధోగతిపాలవడం ఖాయం.

ఈ ఉతూపద వార్తలు ఇంతటితో సమాప్తం. మరో సందర్భంలో మళ్ళీ ....

ఇట్లు, భారతమాత అభిమానాణువుని...
డా॥ పెళ్ళకూరు జె.పి.రెడ్డి, MBBS FSI FIC (USA)
చర్మ & తొలిసెక్సాలజిస్ట్
రైలుకట్టవీధి, పొగతోట, నెల్లూరు. మంగు, బొల్లికై - 0861 - 2333666.

## లయన్స్ క్లబ్ నేతృత్వంలో
# ప్రైవేటు ఉపాధ్యాయులకు శిక్షణ




శిక్షణా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బి.మనోహర్‌రెడ్డి

లయన్స్ అంతర్జాతీయ సంస్థ చేపట్టిన లయన్స్ క్వెస్ట్ ప్రోగ్రాంలో నెల్లూరులోని ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు విలువలాధారిత విద్యపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈనెల 8న శిక్షణ ముగింపు సమావేశంలో జిల్లా అడిషనల్ జాయింట్ కలెక్టర్ సిహెచ్ పెంచలరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఉన్నత విలువలను పిల్లలలో పాదు గొల్పడానికి ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చిన లయన్స్‌క్లబ్ ప్రయత్నం అభినందనీయ మన్నారు. లయన్స్ గవర్నర్ శరత్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణలో తెలుసుకున్న మెళకువలను తమ బోధనలో ఉపయోగించి నాణ్యతను పెంచుకోవాలన్నారు. కార్యక్రమ అధ్యక్షులు మైథిలి ఇంగ్లీషు మీడియంహైస్కూలు కరస్పాండెంట్ బి.మనోహర్‌రెడ్డి ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఆవశ్యకతను వివరించారు. నెల్లూరులోని శ్రీనేతాజీ పైలట్ హైస్కూల్(యంయస్ఆర్), మాడరన్ హైస్కూల్, శ్రీ శారద కాన్వెంట్, రాఘవ స్కూల్, వేదవ్యాస, సంఘమిత్ర, శ్రీ గీతాంజలి, శిల్ప, లిల్లీలిటిల్‌ఫ్లవర్ స్కూల్స్ ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు.

కార్యక్రమంలో లయన్స్ వైస్ గవర్నర్ అమృతవల్లి, మాజీ గవర్నర్ మధుసూదనశాస్త్రి, శ్రీనివాసరావు, డి.ఎస్.కుమార్, కరస్పాండెంట్లు, వాకాటి విజయకుమార్‌రెడ్డి, శారదా శ్రీనివాసులు, రాఘవ దశరథరామయ్య లయన్స్ అధ్యక్షులు డా॥రవిశంకర్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజధాని చుట్టే రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

అనూహ్యంగా అభివృద్ధి చెందింది. ఎన్టీఆర్ మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తే, వై.యస్.రాజశేఖరరెడ్డి, చంద్రబాబులు హైదరాబాద్‌ను ఆధునిక అభివృద్ధిపథంలో పయ నింపజేసారు. సీమ, కోస్తా, తెలంగాణ ప్రజల ఉమ్మడిసంపదతోనే హైదరాబాద్‌ను ఇంతగా అభివృద్ధి చేసారు. ప్రసిద్ధిగాంచిన యూనివర్శిటీలు, వైద్య, సాంకేతిక కళాశాలలు, అంత ర్జాతీయ ప్రమాణాలు కలిగిన కార్పొరేట్ ఆసుపత్రులు, ఐటీ ప్రాజెక్టులు, సినీపరిశ్రమ, ఇతర పరిశ్రమలు... ఇలా అన్నీ హైదరాబాద్‌లో కేంద్రీకృతమయ్యాయి. వీటన్నింటిని కొత్త రాజధానిలో ఇప్పటికిప్పుడు ఏర్పాటు చేయగలరా? పదేళ్లకాలంలో కూడా వీటిని తీసుకు రాలేరు. కాబట్టి హైదరాబాద్‌కు ప్రత్యామ్నాయంగా సీమాంధ్రులకు మరో న్యాయం లేదు.

ఇప్పుడు రాష్ట్ర విభజన పరిష్కారమంతా హైదరాబాద్‌తో ముడిపడివుంది. సోనియా గాంధీ అమెరికా నుండి తిరిగొచ్చింది. తెలంగాణను ఇక ఏకపక్షంగా ప్రకటించలేరు. నెలన్నరరోజులుగా సీమాంధ్రలో ఉద్యమం ఆషామాషీగా జరగడం లేదు. పక్కాగా ప్రజలే ఇక్కడ ఉద్యమాలను నిర్వహిస్తున్నారు. కొందరి చెప్పుడు మాటలు విని కాంగ్రెస్ అధిష్టానం తొందరపడింది. ఆ తొందరపాటును సరిదిద్దుకోవాలంటే హైదరాబాద్ విషయంలోనన్నా తెలివిగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. హైదరాబాద్ మీద మీకు హక్కులేదంటే ఏ సీమాంధ్రుడు ఒప్పుకోడు. సీమాంధ్రులకు కూడా హైదరాబాద్‌లో హక్కు అధికారం కల్పించే విధంగా కాంగ్రెస్ విభజన నిర్ణయం తీసుకుంటేనే... డిపోల్లో నిలిచిన బస్సులు ముందుకు కదులుతాయి, ఆఫీసులు తెరుచుకుంటాయి, ఉద్యోగులు ఉద్యమాలను వదిలి విధులకు బయల్దేరుతారు. విద్యార్థులు ప్లేకార్డులను వదిలి పుస్తకాలు పడతారు. పాఠశాలలు తెరచుకుంటాయి. సీమాంధ్రలోని 13జిల్లాల్లో కూడా జూలై 30వ తేదీ ముందునాటి పరిస్థితి ఏర్పడుతుంది. కాంగ్రెస్ ఏ మాత్రం ఇదే మొండివైఖరితో పోయినా ఉద్యమజ్వాలలు మరింతగా ఎగిసిపడతాయి.


# ఆత్మస్తుతియాత్ర

(మొదటిపేజీ తరువాయి)

తెలుగుదేశంకు మైనస్ అయ్యింది. దీంతో సీమాంధ్రలోనైనా పార్టీని నిలుపుకోవాలనే ఉద్దేశ్యంతో చంద్రబాబు సీమాంధ్రలో ఆత్మగౌరవయాత్ర అంటూ బిస్సెక్కారు. చంద్రబాబు ఎప్పుడు ప్రచారం లేదా పర్యటనలు మొదలుపెట్టినా చిత్తూరుజిల్లా నుండి శ్రీకారం చుట్టేవాళ్లు. కాని ఆత్మగౌరవయాత్రను మాత్రం గుంటూరు జిల్లాలో మొదలుపెట్టి కృష్ణాజిల్లాలో ఆపేసారు. ఈ రెండు జిల్లాలనే ఆయన ఎంచుకోవడానికి ప్రధానకారణం ఇక్కడ ఆయన సామాజిక వర్గీయులు ఎక్కువుగా వుండడమే. కాబట్టి ఈ రెండు జిల్లాల్లో ఆయనను ప్రజలు నిలదీసే సందర్భాలు రాలేదు. గుంటూరు జిల్లా నుండి ఇటు ప్రకాశం జిల్లా వైపు వచ్చివున్నా, లేక కృష్ణాజిల్లా నుండి అటు పశ్చిమగోదావరి జిల్లావైపు వెళ్లివున్నా... అక్కడ విభజనకు సై అని చెప్పొచ్చి ఇక్కడ ఏం ముఖం పెట్టుకుని యాత్రలు చేస్తున్నారని ప్రజలు నిలదీసేవాళ్లు. ఈ ప్రమాదం పసిగట్టబట్టే చంద్రబాబు తన యాత్రను తన వరకు సేఫ్ జోన్‌లోనే ముగించాడు.

PDF Compressor Free Version





## దసరాకు దారొస్తుందా?

రాష్ట్రంలో నెలకొన్న అనిశ్చితి వాతావరణం కారణంగా పవన్ కల్యాణ్ 'అత్తారింటికి దారేది' విడుదల వాయిదా పడుతూ వస్తుంది. ఆగష్టు 7న విడుదల కావాల్సిన ఈ సినిమాను ఇప్పటికే పలు మార్లు వాయిదా వేయగా వచ్చే దసరా సెలవులకైనా ఖచ్చితంగా విడుదల చేయాలనే ఆలోచనతో సినిమా నిర్మాత ఉన్నట్లు తెలుస్తుంది.

## మూ 'వీ' క్షణం



### తల్లీకూతుర్లు...
## అక్కాచెల్లెళ్లుగా

టాలీవుడ్ నుండి బాలీవుడ్ దాకా ప్రేక్షకులను ఉర్రూతలూగించిన అతిలోక సుందరి శ్రీదేవి ఇటీవల సెకెండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టడం తెలిసిందే! కాగా, శ్రీదేవి కూతురు జాహ్నవిని హీరోయిన్‌గా పెట్టి ఆమె అక్క పాత్రలో శ్రీదేవిని తీసుకుంటూ ఓ నిర్మాత సినిమాను ప్లాన్ చేసాడు. దీనికిగాను శ్రీదేవికి భారీగానే ఆఫర్ చేసినట్లు తెలుస్తుంది.



## బద్దలవడానికే రికార్డులు

తెలుగు సినీ పరిశ్రమలో సినిమా ఆదేరోజుల కంటే కలెక్షన్ల రికార్డులకే ప్రాధాన్యత పెరిగింది. ప్రస్తుతం మహేష్ నటిస్తున్న '1' చిత్ర రెండో టీజర్ కేవలం 67గంటల్లోనే 10లక్షల హిట్స్ సాధించి టాలీవుడ్‌లో రికార్డు సృష్టించిందని అభిమానులు చెబుతున్నారు. శాటిలైట్ హక్కుల్లో కూడా '1'దే నెంబర్ 1 స్థానమట!



## ప్రభాస్‌కు కొత్త మమ్మీ

'మిర్చి' సినిమాలో ప్రభాస్ తల్లిగా నటించిన నదియాను చూసి ఆమె తల్లిగా కంటే అక్కగానే కనిపించిందని చాలామంది కామెంట్ చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకునేమో ప్రభాస్ తల్లిని కొంచెం ముదురుగా చూపించేందుకు 'బాహుబలి' చిత్రంలో గత గ్లామరస్ హీరోయిన్ రమ్యకృష్ణను ప్రభాస్ తల్లిగా తీసుకున్నారు. ఈ సినిమాలో ఆమెది చాలా కీలకపాత్రంట!

## శృతి తప్పింది

తెలుగు ఇండస్ట్రీలో ఈమధ్య హీరోయిన్‌లకు కొరత ఏర్పడుతుంది. మహేష్ హీరోగా త్వరలో సెట్స్ మీదకు రానున్న 'ఆగడు' చిత్రానికి మెయిన్ హీరోయిన్ సమస్యగా మారింది. సెకెండ్ హీరోయిన్‌గా తమన్నాను ఎంపికచేయగా మొదటి హీరోయిన్‌గా ఖరారు చేసిన శృతిహాసన్ మళ్ళీ హ్యాండిచ్చినట్లు తెలుస్తుంది. తమన్నాతో పడకే శృతి తప్పుకుందని సమాచారం!



# గూడూరు డివిజన్ వార్తలు

## విభజనకు ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేదిలేదు

### జేఏసి నాయకుల వెల్లడి



ఆర్టీసీ కార్మికుల దీక్షా శిబిరంలో ప్రసంగిస్తున్న గూడూరు జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఎ.శివకుమార్, ప్రక్కన నీలం రాజారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జేఏసి నాయకులు.

రాష్ట్ర విభజనకు ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని సమైక్యవాదులు స్పష్టం చేస్తున్నారు. సమైక్య రాష్ట్రం ముక్కలైతే సీమాంధ్ర ప్రజలకు తీవ్రనష్టం తప్పదని సమైక్యాంధ్ర జేఏసీ నాయకులు జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నీలం రాజారెడ్డి అన్నారు. సమైక్యపోరులో భాగంగా టవర్‌క్లాక్ సెంటర్‌లోని రిలేదీక్షా శిబిరంలో ఆదివారం ఆర్టీసీ కార్మికులు కూర్చున్నారు. వారికి మద్దతుగా జేఏసీ నేతలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ముందుగా గూడూరు జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, కోట సునీల్ రిలేదీక్షా శిబిరంలో ఆర్టీసీ కార్మికులకు నిరసన మాలలువేసినారు. ఈ సందర్భంగా శివకుమార్, సునీల్ మాట్లాడుతూ రాష్ట్రం సమైక్యంగా ఉండాలని, సీమాంధ్ర మంత్రులంతా రాజీనామాలుచేసి సమైక్యాంధ్ర ఉద్యమంలో కూర్చొని సమైక్యాంధ్ర వచ్చేంత వరకు పోరాడాలని అన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసి యూనియన్ వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో ఆర్టీసీని పూర్తిగా మూసేయాల్సిన పరిస్థితి తలెత్తుతుందన్నారు. యూపీఏ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించి సీమాంధ్ర ప్రజల మనోభావాలను విస్మరించి విభజనకు ఒడిగట్టడం దారుణమన్నారు. సేవ్ ఆంధ్రప్రదేశ్ సభకు వెళ్లివస్తున్న ఎన్జీఓల బస్సుల అద్దాలు పగలగొట్టడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో డి.ప్రజ్ఞేందర్‌రెడ్డి, ఎం.గోపాలకృష్ణయ్య, నాగేంద్రప్రసాద్, మల్లిఖార్జున్, సిద్ధయ్య, రమణయ్య, సుందర రామయ్య, బాలాజీ, ఏ.వి.రమణయ్య, ఎస్.వి.రమణయ్య, పిచ్చిరెడ్డి, మురళీకృష్ణ ప్రసాద్, మాసిన తదితరులు పాల్గొన్నారు.

### నారాయణ కళాశాల ఆధ్వర్యంలో
## సారంగం శ్రీనివాసులుకు సత్కారం

జిల్లా అంధత్వ నివారణ సంస్థ, నారాయణ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని నారాయణ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన నేత్రదాన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో గూడూరు సునీతా సేవాసంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు సత్కారం పొందారు. ఈయనను నేత్రదాన కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారని సత్కరించారు. నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా అంధత్వ నివారణసంస్థ అధికారి డాక్టర్ మంజులమ్మ అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పీ.ఎల్.రావు, నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.వీర నాగిరెడ్డి, డాక్టర్ రామ్మోహన్, ప్రొఫెసర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి



గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న సునీతా సేవాసంస్థ సభ్యులు

గూడూరు సునీతా సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన గర్భవతులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రామకృష్ణ సతీమణి లక్ష్మీకామేశ్వరి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. దానితో పాటు వైద్యుల సలహాలను పాటించాలని, మంచి పుస్తకాలను చదవడంతో పాటు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ కె.చౌడేశ్వరి, ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ ఉమామహేశ్వరి, సంస్థ ప్రధాన కార్యదర్శులు ఉమామహేశ్వరి, సారంగం సులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్‌పోటీలు

గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గూడూరు క్రికెట్ అసోసియేషన్, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్ పాఠశాల క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. 7వతేదీన జరిగిన మ్యాచ్‌లలో మినర్వా, జెమ్స్, ఎల్ఏపీ జట్టు విజయం సాధించాయి. ఈ మ్యాచ్‌లకు సుబ్రహ్మణ్యం, ప్రనూప్, సాయిచరణ్, హరి అంపైర్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కె.మునిగిరీష్, మయూరి శ్యాంయాదవ్ పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవా సంఘం సమైక్యహోమం



హోమం చేస్తున్న బ్రాహ్మణసంఘం సభ్యులు

గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో టవర్ క్లాక్ సెంటర్‌లో ఆదివారంనాడు హోమం నిర్వహించారు. రాష్ట్రం సమైక్యంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు, బ్రాహ్మణసేవా సంఘం నాయకులు కోటసునీల్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### గూడూరులో ఘనంగా
## గణేష్ ఉత్సవాలు



గూడూరు పట్టణంలో ఘనంగా వినాయకచవితి ఉత్సవాలు జరిగాయి. పట్టణంలోని పాతబస్టాండు, గాంధీబొమ్మ, సొసైటీ, మోతిమహల్ సెంటర్, గణేష్ నగర్, రాజావీధి, ఇందిరానగర్, కరణాల వీధి, తూర్పువీధి, జానకిరామ్‌పేట, మాళవ్యానగర్ తదితర ప్రాంతంలో ఘనంగా జరిగినవి. అన్ని ప్రాంతాలలో పోటాపోటీగా వినాయక విగ్రహాలను పెట్టి భారీగా విద్యుత్‌దీపాలతో అలంకరించి ఘనంగా నిర్వహించారు.

అదే విధంగా సమక్యాంధ్ర కొరకు జేఏసి ఆధ్వర్యంలో గూడూరు టవర్‌క్లాక్ వద్ద పూజలు నిర్వహించి సమైక్యాంధ్ర కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


అహల్యాదేవి నర్సింగ్ హోమ్



Dr. M.C.S. రెడ్డి
M.B.B.S., M.D. (Gen. Med)
Dip. Diab (Diabetology)
PGFC (Cardiology)
IDCC (Infectious Diseases)
Mumbai


జనరల్ ఫిజీషియన్, షుగర్ వ్యాధి మరియు ఇన్‌ఫెక్షువస్ డిసీజెస్ (విషజ్వరాల) స్పెషలిస్ట్

బి.పి., షుగరు, థైరాయిడ్, కిడ్నీ, మూర్ఛలు, విష జ్వరాలు, నిమోనియా, ఉబ్బసం, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జబ్బులకు 24 గం॥లు అత్యవసర చికిత్సా సౌకర్యం.

నెల్లూరులో ప్రప్రథమంగా Infectious Diseases (విషజ్వరాలకు) కోర్సులో శిక్షణపొందిన డాక్టరు

ఓ.పి. కొరకు సంప్రదించండి.

అహల్యాదేవి నర్సింగ్ హోమ్ | విజయ హాస్పిటల్
నెల్లూరు, సెల్: 98662 36246


నేతలు తలో దారి...

# సీమాంధ్రను చేసారు ఎడారి

## నాయకుల పాపం.. ప్రజలకు శాపం...!

రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్ అధిష్టానానికే అడ్డం తిరిగిన మొనగాడిగా సీమాంధ్రలో ముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డికి మంచి గుర్తింపు వచ్చింది. కిరణ్‌కు విభజన సంకేతాలు ముందుగానే అందాయి. అయితే దానిని అడ్డుకోవడానికి కిరణ్ తన ప్రయత్నాలు తాను చేసాడు. అధిష్టానం రోడ్‌మ్యాప్ అడిగినప్పుడు కిరణ్ పక్కాగా సమైక్యాంధ్రకు అనుకూలంగానే తన నివేదిక ఇచ్చాడు. రాష్ట్రం విడిపోతే తలెత్తే నక్సల్స్ సమస్యను ప్రధానంగా ప్రస్తావించారు. అలాగే కరెంట్, నీళ్ల వంటి సమస్యలను కూడా ఉటంకించారు. అయితే సీట్లు, ఓట్ల మత్తులో కళ్లు మూసుకుపోయి వున్న కాంగ్రెస్ అధిష్టానం ఆయన నివేదికను కళ్లతో కూడా చూడ్లేదు. ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు ఎంపీ సీట్లన్నా కావాలంటే తెలంగాణను ప్రకటించాల్సిందేనని వాళ్ల మైండ్‌లో బ్లైండ్‌గా ఫిక్సయ్యారు. అదే గుడ్డితనంతో ముందుకుపోయారు.

సీఎంకు ఇతర నేతలకు పడకపోవడం కూడా సీమాంధ్రకు లోపమే అని చెప్పుకోవాలి. అధిష్టానం రోడ్‌మ్యాప్ కోరినప్పుడు తెలంగాణ నేతలంతా ఒకే రూట్‌లో వెళ్లారు. ఒకే కోణంలో తమ వాదన వినిపించారు. తెలంగాణ సాధనకు అక్కడి నాయకులంతా ఒకే దారిలో నడిచారు. కాని సీమాంధ్రకు వచ్చేసరికి ఆ ఐక్యత కనపడలేదు. కిరణ్ ఒక్కడే వెళ్లి తన వాదన వినిపించాడు. పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ ప్రత్యేకంగా వెళ్లి తన నివేదిక ఇచ్చారు. ఇక సీమాంధ్ర కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు ఎవరిదారి వాళ్లు చూసుకున్నారు. వీరిలో ఐక్యత లేకపోవడం, ఒకే వాదనపై నిలబడకపోవడం కాంగ్రెస్ అధిష్టానానికి కలిసొచ్చింది. వీళ్ల వాదన బలంగా లేకపోవడం వల్లే చాలా సులభంగా విభజన ప్రకటన చేసింది.

విభజన ప్రకటన చేసాక కూడా సీమాంధ్ర నాయకులు ఒక తాటి మీదకు రాలేకపోయారు. విభజన ప్రకటన వెలువడ్డాక 9రోజులకు గాని కిరణ్ బయటకు రాలేదు. విలేకరుల సమావేశం పెట్టి విభజనపై తన ఆగ్రహం వెలిబుచ్చారు. సమస్యలను పరిష్కరించకుండా విభజనపై ఎలా ముందుకెళతారని అధిష్టానాన్ని నిలదీసారు. ఆలస్యంగా స్పందించినా కూడా కిరణ్ అధిష్టానంలో కొంత స్పందన తేగలిగారు. తెలంగాణపై మరీ దూకుడుగా పోకుండా అధిష్టానానికి కళ్లెం వేయగలిగారు. కాని పీసీసీ చీఫ్ బొత్స మాత్రం కనీసం అధిష్టానాన్ని ప్రశ్నించే ధైర్యం కూడా చేయలేదు. సోనియా గాంధీ వీరవిధేయుడిగా, అపరభక్తుడిగా ముద్ర వేయించుకోవడానికి నానా తంటాలు పడ్డారు.

ఇక కేంద్రమంత్రులదైతే విభజన పాపంలో అగ్రవాటా! కాంగ్రెస్ అధిష్టానానికి వీళ్లు బానిసలయ్యారు. విభజనపై ఏ ఒక్క సీమాంధ్ర కేంద్ర మంత్రి కూడా తన నిరసన తెలపలేదు. కాంగ్రెస్ నిర్ణయాన్ని వ్యతిరేకించలేదు. 9మంది సీమాంధ్ర కేంద్రమంత్రులు గనుక తమ పదవులకు రాజీనామాలు చేసి వుంటే పరిస్థితి ఇంకోవిధంగా వుండేది. విభజన విషయంలో కాంగ్రెస్ అధిష్టానం దిగొచ్చేది. సీమాంధ్ర ఎంపీలు, రాష్ట్రమంత్రులు కూడా విభజన విషయంలో తలోదారి అన్నట్లుగా వుండబట్టే రాష్ట్రం ఎడారిగా మారింది. సీమాంధ్ర నేతలు ఇకనైనా కళ్లు తెరవకుంటే ప్రజలకు ద్రోహం చేసినట్లే!

మాగుంట లేఅవుట్‌లో...

## మారుతున్న రోడ్ల రూపురేఖలు

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, మాజీమేయర్ ఎన్.భానుశ్రీల సహకారంతో, మాగుంట లేఅవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ వారి సారథ్యంలో మాగుంట లేఅవుట్ రూపురేఖలు మారుతున్నాయి. మాగుంట లేఅవుట్ ప్రాంతానికి సరికొత్త అందాలు తెచ్చే రెండు ప్రధానరోడ్లకు ఈ నెల 15వ తేదీన శంకుస్థాపన జరగబోతుంది. మాగుంట లేఅవుట్ పోలీస్ అవుట్‌పోస్ట్ నుండి అన్నమయ్య విగ్రహం వరకు సిమెంట్‌రోడ్డు, అక్కడనుండి గొలగమూడి వరకు బీటీ రోడ్డును 14కోట్ల రూపాయలతో 10మీటర్ల మేరకు విస్తరించనున్నారు. అలాగే వేంకటేశ్వరస్వామి గుడి సమీపంలోని లేఅవుట్ ప్రధానరోడ్డులో 60అడుగుల సిసి రోడ్డు మరియు డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన జరుగనుంది. 15వ తేదీ ఉదయం 10గంటలకు ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీమేయర్ ఎన్.భానుశ్రీలు ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కనుమూరు శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

కన్నీళ్లు మనకు...

## కండలేరు నీళ్ళు వాళ్ళకా..?

కండలేరు జలాశయం నుండి చిత్తూరు జిల్లాకు నీటి తరలింపును ఆపాలని 10 టీఎంసీల నీటిని తరలించడానికి అనుమతి ఇవ్వడం మంత్రి ఆనం రామనారాయణరెడ్డిది దుర్మార్గపు చర్య అని అందుకు ఆయన వెంటనే రాజీనామా చేయాలని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి అంజనేయరెడ్డి డిమాండ్ చేసారు. బుధవారం నెల్లూరు నగరంలోని బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశలో ఆయన మాట్లాడుతూ కండలేరు జాలాశయం నుండి నీటిని పీలేరుకు తరలిస్తే నెల్లూరు జిల్లా ఎడారిగా మారిపోతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో జిల్లాను ఎడారి కానివ్వమన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిదతల రమేష్ మాట్లాడుతూ ఇప్పటి వరకు పాలకులు, ప్రభుత్వాలు నెల్లూరు జిల్లా ప్రజలను మూడు పర్యాయాలు మోసం చేశాయన్నారు. మొదటిసారి నాగార్జున సాగర్ కుడికాలువను నెల్లూరు జిల్లా సంగం వద్దకు అనుసంధానం చేయాల్సి వుంటే 240 మైళ్ళ కాలువను 135 మైళ్ళ వరకు నిర్మించి ఆపేశారన్నారు. దీనివల్ల 35.096 టీఎంసీల నికరజలాలు జిల్లా ప్రజలు నష్టపోయారన్నారు. తెలుగుగంగ ద్వారా కృష్ణజలాలను శ్రీశైలం నుండి సోమశిల ద్వారా చెన్నైకు తాగునీరు 15 టిఎంసిలు వచ్చే మార్గం నిర్మాణంలోనే లేదన్నారు. కర్నూలు జిల్లా వేంపెంట గ్రామంలో బనకర్ల క్రాస్ రెగ్యులేటర్, నిప్పుల వాగు మధ్య కెనాల్ వెడల్పు చేయాల్సి వుంటే కర్నూలు జిల్లా రాజకీయనాయకులు అడ్డుకున్నారన్నారు.

## కావలిలో పొలికేక కెవ్వుమంది...

సమైక్యాంధ్రకు మద్దతుగా గురువారం కావలిలో నిర్వహించిన పొలికేక కెవ్వుమంది. కావలి పట్టణం జనంతో పోటెత్తింది. దాదాపు 4కిలోమీటర్ల మేర విద్యార్థులు, ప్రజలు, ఉద్యోగులు, వివిధ సంఘాల వారు బారులుతీరి ర్యాలీగా కదలివచ్చారు. కార్యక్రమంలో సమైక్యాంధ్ర ఆవశ్యకతను చాటుతూ ప్రదర్శించిన కళారూపాలు అందర్నీ అలరించాయి. కావలి చుట్టుపక్క గ్రామాల నుండి కూడా పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దేశభక్తిని పెంచేది యువశక్తే!

## స్ఫూర్తినిచ్చిన 'దేశభవితకు యువత పరుగు'

తన ఆధ్యాత్మిక ప్రభోదనలతో ప్రపంచాన్నే తట్టిలేపిన స్వామి వివేకానంద 150వ జయంతిని పురస్కరించుకుని జయంతి ఉత్సవ సమితి 11వ తేదీ నెల్లూరు నగరంలో 'దేశభవితకు యువత పరుగు' కార్యక్రమాన్ని నిర్వహించింది. జాతీయ జెండాలు చేతపట్టి పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనగా జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ జాతీయ జెండాను, జిల్లా ఎస్పీ పి.వి.యస్.రామకృష్ణ కాగడాను చేతపట్టి ఈ పరుగును ముందుండి ప్రారంభించారు. ఈ పరుగులో పాల్గొన్న యువకులు రెట్టించిన ఉత్సాహంతో భారత్ మాతాకీ జై, మాతరం మాతరం వందే మాతరం... అని నినదిస్తూ నగరవీధుల్లో పరుగులు తీసారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు, అర్జునుడు, శ్రీకృష్ణదేవరాయలు, ఛత్రపతి శివాజీ, రాణాప్రతాప్, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద వేషధారణలతో పాల్గొన్న వారు ఎంతో ఆకర్షణగా నిలిచారు.



కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ పివియస్ రామకృష్ణ తదితరులు



ర్యాలీలో పాల్గొన్న యువకులు

పరుగుకు ముందు టౌన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ వివేకానందుని జీవితాన్ని, బోధనల్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువత ముందుకు పయనించాల్సి వుందన్నారు. దృఢమైన సంకల్పం లేనందువల్లే నేటి యువత మానసిక ఒత్తిడికి లోనవుతుందని చెప్పారు. యువశక్తితోనే దేశభక్తి సాధ్యమవుతుందని, తల్లిదండ్రులు చిన్నతనం నుండే తమ పిల్లలకు దేశభక్తిని నూరిపోయాలని కోరారు. ప్రేమ, పెళ్లి అనేవి సాధారణ విషయాలని, పదిమందికి ఉపయోగపడేలా మన జీవితాలను మలచుకోవాలన్నారు. దేశ సమస్యలపై గళమెత్తిన మొదటి వ్యక్తిగా వివేకానందను అభివర్ణించారు. ఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ ఆదర్శవంతులు ఎక్కడో వుండరని, ఎవరైతే మంచిమార్గంలో నడుస్తారో వారినే మనం ఆదర్శంగా తీసుకుంటామన్నారు.

ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుందరరామం, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుడుముల అశోక్‌రావు, ఉపాధ్యక్షురాలు యండ్లపల్లి అమృతవల్లి, దుగ్గిశెట్టి జ్యోతి, త్వరకవి శ్రీహరి, సభ్యులు అచ్యుత సుబ్రహ్మణ్యం, డాక్టర్ రవిశంకర్, సురేష్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఆచార్యులుగా ప్రొఫెసర్ శివశంకర్

కావలి పట్టణంలోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం పిజీ సెంటర్‌లో వాణిజ్య అధ్యాపకునిగా పనిచేస్తున్న ప్రొఫెసర్ పి.ఆర్.శివశంకర్ ఉత్తమ ఆచార్యులుగా ఎంపికై ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆయన తొలుత పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా నియమితులై తదుపరి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పనిచేసి ప్రస్తుతం విక్రమసింహపురి విశ్వవిద్యాలయం పిజిసెంటర్ స్పెషల్ ఆఫీసరుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన అధ్యాపకుడిగానే కాక పరిశోధనలో తనదైన శైలిని కనబరిచారు. 30సంవత్సరాలుగా దేశవిదేశాలలోని ప్రముఖ జర్నల్స్‌లో ఆయన వ్యాసాలు 40దాకా ప్రచురితమయ్యాయి. 3యుజిసి పరిశోధక ప్రాజెక్టులు పూర్తిచేసి నాక్ కమిటీ సభ్యులుగా, యుజిసి నెట్ పరీక్షల పర్యవేక్షణాధికారిగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా వియస్‌యూ పి.జి సెంటర్ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY**, Executive Editor-**G.SREENIVASULU REDDY**.